1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 03 సంచిక : 166
మంగళవారం 23 జూన్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.



## నౌకాయాన సామర్థ్యమే రక్షాకవచం

**3 నౌకల్ని ప్రారంభించిన ప్రధాని**

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 22)**

నౌకాయానపరంగా బలమైన సామర్థ్యంతో ఉండటం.. ఏ దేశ ఆర్థిక, వ్యూహాత్మక ప్రభావాన్నైనా నిర్ణయించడంలో కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దీనిని మన దేశం అర్థం చేసుకుని తదనుగుణంగా సన్నద్ధమవుతోందని చెప్పారు. భారత నౌకాదళాన్ని మరింత బలోపేతం చేసేందుకు దేశీయంగా నిర్మించిన ఐఎన్ఎస్ దునాగిరీ, ఐఎన్ఎస్ అగ్రయ్, సర్వే నౌక ఐఎన్ఎస్ సంశోధక్‌లను ఆయన జాతికి అంకితం చేశారు. శత్రువుల ఎత్తుగడలను చిత్తు చేసేలా అత్యాధునిక దేశీయ పరిజ్ఞానంతో తయారు చేసిన వీటిని కోల్‌కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఓడరేవులో ప్రధాని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రక్షణ రంగంలో స్వావలంబన కోసం మన దేశం చేస్తున్న కృషికి ఈ నౌకలు నిదర్శనమని పేర్కొన్నారు. ▶మిగతా 2లో



## బ్రిటన్ పీఠం 'కింగ్ ఆఫ్ నార్త్'దేనా?

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 22)**

దశాబ్ద కాలంగా రాజకీయ అస్థిరతతో సతమతమవుతోన్న యూకేలో మరోసారి అధికార పీఠం ఖాళీ అయ్యింది. ప్రధానమంత్రి పదవికి కీర్ స్టార్మర్ వైదొలగడంతో నాయకత్వ సంక్షోభం ఎదురైంది. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో యునైటెడ్ కింగ్డమ్ పాలనా పగ్గాలు అందుకునే తదుపరి నేత ఎవరనేది ఆసక్తికరంగా మారింది. ఈ రేసులో ప్రధానంగా వినిపిస్తున్న పేరు ఆండీ బర్న్‌హామ్. లేబర్ పార్టీలో 'కింగ్ ఆఫ్ ది నార్త్'గా పేరొందిన ఆండీ .. కొత్త ప్రధానిగా బాధ్యతలు చేపట్టే అవకాశం కన్పిస్తోంది. ఇంతకీ ఎవరాయన?

గ్రేటర్ మాంచెస్టర్ మేయర్‌గా పనిచేసిన ఆండీ బర్న్‌హామ్ సుదీర్ఘకాలం తర్వాత మళ్లీ పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన మేకర్‌ఫీల్డ్ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. దీంతో ప్రధాని పదవికి బరిలో నిలిచేందుకు ఆయనకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం బ్రిటన్‌లో లేబర్ పార్టీ అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ పార్టీకి నాయకత్వం వహించే వ్యక్తి బ్రిటన్‌కు ప్రధానిగా వ్యవహరిస్తారు. లేబర్ పార్టీలో బర్న్‌హామ్‌ను కీర్ స్టార్మర్‌కు ప్రధాన ప్రత్యర్థిగా పేర్కొంటారు. "ప్రజలు నాపై నమ్మకం పెడితే నేను రాజకీయాలను మార్చేస్తా" అంటూ ఆండీ ఇటీవల తన రాజకీయ ఆకాంక్షను బయటపెట్టారు. ▶మిగతా 2లో




## అమెరికాకు షాకిచ్చిన చైనా.. కీలక కంపెనీలపై ఆంక్షలు

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 22)**

అమెరికాకు చెందిన 10 సైనిక సంబంధిత కంపెనీలపై చైనాఆంక్షలు విధించింది. ఆయా కంపెనీలకు పౌర-మిలిటరీ విని యోగ వస్తువుల ఎగుమతిని నిషేధిస్తున్నట్లు తెలిపింది. వీటిల్లో రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి. అగ్రరాజ్యం ఇటీవల తమ రక్షణ రంగ కాంట్రాక్టుల్లో చైనా టెక్ కంపెనీలను నిషేధించిన నేపథ్యంలో బీజింగ్ ఈ చర్యలు చేపట్టింది. దీంతో పాటు అమెరికాకు చెందిన 46 కంపెనీల నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా తమ ప్రభుత్వ రంగ సంస్థలను నిరోధించను న్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.అంతే కాకుండా ఇతర దేశాలు చైనా నుంచి కొనుగోలు చేసిన వస్తువులను.. ఆంక్షలకు గురైన అమెరికా కంపెనీలకు బదిలీ ▶మిగతా 2లో

# కుట్రలతో ప్రభుత్వంపై దుష్ప్రచారం..

## అప్రమత్తంగా ఉండాలి



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 22)**

రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయని.. ప్రతి అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. వివిధ ఘటనలకు కులమతాల రంగు పులుముతున్నారని.. వాటిని వివాదాస్పద అంశాలుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీజీఎస్‌పై సమీక్షలో భాగంగా సీఎం మాట్లాడారు. ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులు, అధికారులను బద్నాం చేస్తున్నారన్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. ఇలాంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. మానవీయ కోణంలో పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు.

ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారని చంద్రబాబు అన్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పు దారి పడుతున్నారని వ్యాఖ్యానించారు. 2019లో జరిగిన కొన్ని నేరాలను ఇప్పుడు ట్రేస్ చేసి పట్టుకుంటున్నారని, శిక్షలు కూడా పడుతున్నాయని చెప్పారు. ఇలాంటివి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. తప్పుచేసిన వాడు ఎప్పుడూ తప్పించుకోలేడని హెచ్చరించారు. డిసెంబర్ నెలలో క్వాంటం కంప్యూటర్ లాంచ్ చేసేలోపు క్వాంటం పార్కు, సెమీ కండక్టర్ల పార్కు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలన్నారు.

## మా కష్టాన్ని తక్కువ చేసేలా మాట్లాడొద్దు



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 22)**

'ఏళ్లతరబడి కష్టపడి చదివి డీఎస్సీలో కొలువులు సాధిస్తే.. మాజీ సీఎం జగన్, వైకాపా నేతలు అసత్యప్రచారం చేస్తున్నారు. మేం రాత్రీ పగలు రోజుకు 15గంటలకు పైగా కష్టపడి చదివాం. మా విజయాన్ని తక్కువ చేసేలా విషప్రచారం చేస్తున్నారు. మెగా డీఎస్సీలో అర్హులైన 16,344 మందికే కొలువులొచ్చాయి. మా ఆవేదనను చెప్పుకొనే అవకాశం ఈ వేదిక ద్వారా దక్కింది. మాలో ఏ ఒక్కరి కొలువుకు ఎసరు పెట్టాలని ప్రయత్నం చేసినా ఊరుకునేదే లేదు' అంటూ డీఎస్సీ 2025లో కొలువులు సాధించిన పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీపై అసత్యప్రచారం చేస్తున్నారంటూ.. కృష్ణాజిల్లా తెలుగుయువత ఆధ్వర్యంలో ఉయ్యూరు మండలం గండిగుంటలో 'నిరుద్యోగ యువతపై గొడ్డలివేటు' పేరుతో ఆదివారం నిర్వహించిన సదస్సులో పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మేధావులు గళం విప్పాలి**

డీఎస్సీపై జరుగుతున్న అసత్య ప్రచారంపై మేధావులైన ఉపాధ్యాయులు మౌనం వహించకూడదని, గట్టిగా గళం విపించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ▶మిగతా 2లో

## స్థానికుల కోరిక మేరకు నచ్చిన దేవుడి మందిరాలు

### మంత్రి ఆనం




**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 22)**

గత ప్రభుత్వ హయాంలో విచ్ఛిన్నకర వాతావరణం ఉండేదని, దేవాలయాలకు సరైన ఆదరణ ఉండేది కాదని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సచివాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో దేవాదాయశాఖ రెండేళ్ల పనితీరుపై ఆయన రిపోర్టు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాలు సమాజంలో భాగమని గత ప్రభుత్వం మరిచిపోయిందన్నారు." దేవాదాయశాఖ అభివృద్ధి, ప్రగతిని మీ ముందుంచుతున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరుమల నుంచి దేవాదాయ శాఖ ప్రక్షాళన ప్రారంభించింది. పవిత్ర స్థలాలు సామన్యులకు అందుబాటులో ఉంచే చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రతి ఇంటికీ ఆధ్యాత్మికత చేర్చాలన్న సీఎం ఆదేశాలతో పని చేస్తున్నాం. రెండేళ్లుగా హిందువుల ఆత్మవిశ్వాసం, ఆధ్యాత్మిక విలువలు కాపాడుతున్నాం. ఆరు వేలకు పైగా ఆలయాల పునర్నిర్మాణానికి రూ.813 కోట్లు వెచ్చించాం. ధార్మిక పరిషత్ ద్వారా శ్రీవాణి నిధులతో 1200కు పైగా భజన మందిరాలు నిర్మించాం. స్థానిక ప్రజల కోరిక మేరకు నచ్చిన దేవుడి మందిరాలు నిర్మిస్తాం. దేవాదాయ భూ రికార్డులను డిజిటలైజ్ చేసి పరిరక్షణ బాధ్యతలు చేపట్టాం. రానున్న రోజుల్లో 65 ఆలయాల్లో అన్నప్రసాదానికి చర్యలు తీసుకుంటున్నాం. అన్నప్రసాదం కోసం ఏటా దేవాదాయశాఖ రూ.84 కోట్లు ఖర్చు చేస్తోంది." అని మంత్రి ఆనం వివరించారు.

## కాపులపై దాడుల నియంత్రణకు పార్టీలో టాస్క్‌ఫోర్స్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 22)**

కూటమి రెండేళ్ల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా కాపులపై దాడులు తీవ్రమయ్యాయని, ప్రశ్నిస్తే రౌడీలు, క్రిమినల్స్‌గా ముద్ర వేస్తున్నారని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం నియోజకవర్గం వెంకటాయ పాలెంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధ్యక్షతన నిర్వహించిన వైకాపా కాపు సామాజికవర్గ ముఖ్యనేతల ఆత్మీయ సమావేశంలో బొత్స మాట్లాడారు. కాపులపై దాడులను ప్రతిఘటించడానికి పార్టీలో మూడు ప్రాంతాల నుంచి మూడు టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కాపులను సంఘటితం చేయడానికి ఇదే తరహాలో విశాఖపట్నం, తిరుపతిల్లో ముఖ్యనేతలతో సమావేశాలు నిర్వహించాలని తీర్మానించినట్లు చెప్పారు.

సాయికృష్ణను క్రిమినల్ అంటున్నారని.. అయితే చంపేస్తారా, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటారా అని బొత్స ప్రశ్నించారు. ఈ కేసును ప్రభుత్వం తప్పుదోవ పట్టించాలని చూడడంతోనే కాపులంతా రావాల్సి వచ్చిందన్నారు. 'సాయికృష్ణ కుటుంబానికి మేం అండగా ఉంటాం. తలో రూ.50వేలు వేసుకుని ఆర్థికసాయం అందిస్తాం. అవసరమైనప్పుడు కులం కావాలి, తర్వాత వద్దనే నాయకుడ్ని



## గొడ్డలి పార్టీకి తెలిసిందల్లా గంజాయి, హత్యలే: రామ్మోహన్‌నాయుడు

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 22)**

ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ ఐదేళ్లలో అన్నీ తప్పుడు బటన్లు నొక్కారని, చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి అతి పెద్ద తప్పు చేశారని, అందుకే ప్రజల ఆగ్రహానికి గురయ్యారని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు మండిపడ్డారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చేపట్టిన '100 రోజులు..

## రేపు పులివెందులకు వెళుతున్న జగన్.. ప్రజలను నేరుగా కలవనున్న వైసీపీ అధినేత



పులివెందులలో మూడు రోజులు పాటు పర్యటించనున్న జగన్

రేపు సాయంత్రం పులివెందులకు చేరుకోనున్న వైసీపీ అధినేత

నేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్న జగన్

2

## అమెరికా-ఇరాన్ చర్చల ఎఫెక్ట్.. భారీగా పతనమైన ముడిచమురు ధరలు



2

**3శాతం వరకు పడిపోయిన అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్**

**బ్యారెల్ 79 డాలర్ల స్థాయికి చేరిన బ్రెంట్ క్రూడ్**

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 22)**

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు సోమవారం భారీగా పతనమయ్యాయి. అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో

# పీజీఆర్ఎస్‌కు 179 అర్జీలు





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 22)**

మార్కాపురం కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక పరిష్కార వేదిక కార్యక్రమానికి 179 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెవెన్యూకు సంబంధించి 101, ఇతర సమస్యలపై 78 అర్జీలు వచ్చినట్లు వారు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో భూ సమస్యల పై ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాల్సిన బాధ్యతఅధికారుల పైనే ఉందని వివరించారు. ఇక నుంచైనా ఆ దిశగా రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, మార్కాపురం, కనిగిరి ఆర్డీవోలు వెంకట శివరామిరెడ్డి, అజయ్ కుమార్, విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎస్ ఏ కరీం, జిల్లా రవాణాశాఖ అధికారి రాంబాబు, డీఆర్‌డీఏ పీడీ శివన్నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా జర్నలిస్ట్ స్పోర్ట్స్ మీడియా సభ్యులకు క్రికెట్ కిట్ బహుకరణ



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 22)**

ప్రకాశం జిల్లా జర్నలిస్ట్ స్పోర్ట్స్ మీడియా సభ్యులకు భగీరథ కెమికల్స్, ఇండస్ట్రీస్ లిమిటెడ్, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లింగమనేని వెంకటరామయ్య సహకారంతో సోమవారం క్రికెట్ కిట్ బహుకరించారు. జర్నలిస్టులు వార్తల సేకరణ, ప్రసారం ప్రక్రియలో నిరంతరం పని ఒత్తిడిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచేందుకు క్రీడలు దోహదపడతాయనే ఉద్దేశంతో భగీరథ కెమికల్స్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎండి లింగమనేని వెంకట రామయ్య, ఆయన టీం సభ్యుల చేతుల మీదుగా ఈ క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన జర్నలిస్టు క్రీడాకారులు సంస్థ యాజమాన్యానికి, ముఖ్యంగా ఎండీ లింగమనేని వెంకట రామయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమం, ఆరోగ్యం, క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించే ఇటువంటి కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని ఆకాంక్షించారు.

మొదటిపేజీ తరువాయి

## బ్రిటన్ పీఠం ‘కింగ్ ఆఫ్ నార్త్’దేనా?

మూడోసారి లక్ కలిసొచ్చేనా..?

ఆండీ ముర్రే బర్న్‌హామ్ 1970లో వాయువ్య ఇంగ్లాండ్‌లోని మెర్సీసైడ్‌లో జన్మించారు. రాజకీయాలపై ఆసక్తితో లేబర్ పార్టీలో చేరిన ఆయన.. 2001 నుంచి 2017 వరకు ఎంపీగా పనిచేశారు. మాజీ ప్రధాని గార్డన్ బ్రౌన్ హయాంలో క్యాబినెట్‌లో కీలక పదవులు చేపట్టారు. ట్రెజరీ, కల్చరల్, ఆరోగ్య మంత్రిత్వ శాఖల్లో పనిచేశారు. లేబర్ పార్టీలో నాయకత్వ పగ్గాల కోసం ఆండీ గతంలో రెండు సార్లు పోటీపడ్డారు. 2015, 2017లో ఆ బాధ్యతల కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ తర్వాత ప్రధాని కావాలన్న తన కలను పక్కనబెట్టి.. 2017లో గ్రేటర్ మాంచెస్టర్‌కు మేయర్‌గా ఎన్నికయ్యారు. అక్కడ ఆయన రాజకీయ కెరీక్ కీలక మలుపు తిరిగింది.

అలా ‘కింగ్ ఆఫ్ ది నార్త్’ పేరు..

2020లో కొవిడ్ మహమ్మారి సమయంలో నాటి ప్రధాని బోరిస్ జాన్సన్ ప్రభుత్వంపై ఆండీ బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. లాక్‌డౌన్ ఆంక్షల వల్ల ప్రభావితమైన ఉత్తర ఇంగ్లాండ్‌కు ఆర్థిక సాయం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని నాడు ఆయన ఆరోపించారు. అంతేగాక.. నిధుల కేటాయింపుల్లోనూ లండన్‌కు, ఉత్తర ఇంగ్లాండ్‌కు మధ్య బోరిస్ సర్కారు వివక్ష చూపిందని మండిపడ్డారు. దీంతో ఆండీ పేరు నాడు మీడియా, సోషల్ మీడియాలో మార్మోగింది. దేశవ్యాప్తంగా ఆయన పాపులారిటీ పెరిగింది. ఈ క్రమంలోనే ఆండీ మద్దతుదారులు ఆయనను ‘కింగ్ ఆఫ్ ది నార్త్’గా అభివర్ణించారు. ప్రముఖ టీవీ సిరీస్ ‘గేమ్ ఆఫ్ థ్రోన్స్’ రిఫరెన్స్‌తో ఆయనకు ఈ పేరు పెట్టారు. ఈ సిరీస్‌లోనూ ఉత్తర ప్రాంతాల పాలకులు తరచూ రాజు పాలనను ఎత్తిచూపుతారు.

గ్రేటర్ మాంచెస్టర్ మేయర్‌గా ఆండీ పాలనకు కూడా దేశవ్యాప్తంగా పేరొచ్చింది. ప్రభుత్వ రవాణాను మెరుగుపర్చడం, స్థానిక ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చేలా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించడం, అందుబాటు ధరల్లో ఇళ్ల నిర్మాణాలను చేపట్టడం వంటివి చర్యలు జాతీయ మీడియాను ఆకర్షించాయి. అదే పాపులారిటీతో ఆండీ ఇప్పుడు దేశ పార్లమెంట్‌లోకి మళ్లీ అడుగుపెట్టగలిగారు. ఈ క్రమంలోనే కీర్ స్టార్మర్ రాజీనామాతో లేబర్ పార్టీ నాయకత్వ పగ్గాల కోసం పోటీ పడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

## మా కష్టాన్ని తక్కువ చేసేలా మాట్లాడొద్దు

ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి పేర్కొన్నారు. డీఎస్సీని అడ్డుకునేందుకు ఎన్నో కుట్రలు చేసిన జగన్, అవి ఫలించకపోవడంతో తట్టుకోలేక అక్కసుతో విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. క్రీడా రిజర్వేషన్లపై కనీస అవగాహన లేకుండా వైకాపా నాయకులు ఆరోపణలు చేస్తున్నారని కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మండిపడ్డారు. ఇప్పుడు కొలువులు సాధించిన 16వేల మందితో పాటు రాని 5 లక్షల మంది అభ్యర్థుల మనోభావాలను సైతం వైకాపా నేతలు దెబ్బతీస్తున్నారన్నారు. కృష్ణా జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ఎమ్మెల్యే బోడే ప్రసాద్, కృష్ణా జిల్లా తెదేపా అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కాపులపై దాడుల నియంత్రణకు పార్టీలో టాస్క్‌ఫోర్స్

పవన్‌కల్యాణ్‌నే చూస్తున్నాం’ అని మండిపడ్డారు. ‘పార్టీలో కాపులకు రాజకీయ ప్రాధాన్యం దక్కాలి. 2019లో 30కి పైగా సీట్లు దక్కించుకున్నాం. 2024లో 26 సీట్లు, నాలుగు పార్లమెంటు స్థానాలు సాధించుకున్నాం. భవిష్యత్తులో వైకాపాలో కాపుల ప్రాధాన్యం పెంచడానికి కృషిచేయాలని తీర్మానించాం’ అని మాజీ మంత్రి పేర్ని నాని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని, కురసాల కన్నబాబు, దాడిశెట్టి రాజా, గుడివాడ అమర్‌నాథ్, కొట్టు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ వంగా గీత, వైకాపా నేత జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రేపు పులివెందులకు వెళుతున్న జగన్.. ప్రజలను నేరుగా కలవనున్న వైసీపీ అధినేత

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 22)**

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ రేపటి నుంచి తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. రేపటి నుండి జూన్ 25 వరకు సాగే ఈ పర్యటనలో ఆయన స్థానిక నేతలతో సమీక్షలు జరపడంతో పాటు ప్రజలను నేరుగా కలవనున్నారు. రేపు సాయంత్రానికి జగన్ పులివెందులకు చేరుకుంటారు. అక్కడ ఉన్న తన క్యాంప్ కార్యాలయంలో స్థానిక వైసీపీ నేతలు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు అక్కడికక్కడే ‘ప్రజాదర్బార్’ కూడా నిర్వహించనున్నారు.పర్యటనలో భాగంగా రెండో రోజైన జూన్ 24 ఉదయం వేముల మండలం భూమయ్యగారిపల్లిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని జగన్ సందర్శించనున్నారు. ఆలయంలో జరిగే ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొంటారు. గుడి దర్శనం ముగించుకుని మధ్యాహ్నానికి మళ్లీ పులివెందుల క్యాంప్ ఆఫీస్‌కు రానున్న జగన్.. ఆ రోజు మొత్తం ప్రజలు, పార్టీ శ్రేణులతో ముఖాముఖి మాట్లాడుతారు. ఉమ్మడి కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బాధితుల అర్జీలను స్వీకరిస్తారు. అనంతరం మూడు రోజుల పర్యటన ముగించుకుని జూన్ 25వ తేదీ గురువారం ఉదయం పులివెందుల నుంచి తిరుగుపయనమవుతారు.

## అమెరికా-ఇరాన్ చర్చల ఎఫెక్ట్.. భారీగా పతనమైన ముడిచమురు ధరలు

జరిగిన చర్చలు ముగియడంతో చమురు సరఫరాపై నెలకొన్న ఆందోళనలు తగ్గాయి. దీంతో ఇరాన్ నుంచి చమురు ఎగుమతులు పెరిగే అవకాశం ఉందన్న అంచనాలతో ధరలు 3 శాతం వరకు క్షీణించాయి.వివరాల్లోకి వెళ్తే, అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 2 శాతానికి పైగా తగ్గి బ్యారెల్‌కు 79 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. ట్రేడింగ్ ప్రారంభంలో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 82 డాలర్ల పైకి చేరినప్పటికీ, చర్చల వార్తలతో వెంటనే దిగివచ్చింది. అదేవిధంగా అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) క్రూడ్ ధర 3శాతం తగ్గి బ్యారెల్‌కు 75 డాలర్లకు పడిపోయింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించి, బలహీనంగా ఉన్న కాల్పుల విరమణను పొడిగించే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ సీనియర్ అధికారులు చర్చలు జరిపినట్లు వచ్చిన నివేదికలు ఈ పతనానికి ప్రధాన కారణంగా నిలిచాయి.ఇప్పటికే గత వారం కూడా ముడి చమురు ధరలు 8శాతానికి పైగా తగ్గాయి. గల్ఫ్‌లో నిలిచిపోయిన నౌకలను తిరిగి అనుమతించవచ్చని, ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను అమెరికా సడలించవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. తమ దేశం నుంచి చమురు, పెట్రోకెమికల్ ఎగుమతులకు మినహాయింపులు లభించాయని, స్తంభింపజేసిన కొన్ని ఆస్తులను తిరిగి పొందేందుకు మార్గం సుగమమైందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఖ్చీ ప్రకటించడం ఈ అంచనాలకు మరింత బలం చేకూర్చింది.పశ్చిమాసియాలో అనిశ్చితి ఉన్నప్పటికీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 80 డాలర్ల దిగువన ఉండటం, మార్కెట్లు పెద్దస్థాయిలో ఘర్షణలను ఊహించడం లేదనడానికి సంకేతమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, స్విట్జర్లాండ్ చర్చల నుంచి ఇరాన్ వైదొలిగిందనే కొన్ని నివేదికల నేపథ్యంలో ఆసియా-పసిఫిక్ మార్కెట్లలో మిశ్రమ స్పందన కనిపించిందని, భౌగోళిక రాజకీయ పరిస్థితులు ఇంకా అస్థిరంగానే ఉన్నాయని వారు హెచ్చరిస్తున్నారు.

మరోవైపు, ముడి చమురు ధరలు తగ్గడం ఈక్విటీ మార్కెట్లకు కలిసొచ్చింది. సోమవారం ఉదయం దేశీయ సూచీలు లాభాలతో ప్రారంభమయ్యాయి. ఈ ధరల తగ్గుదల భారత్ వంటి ప్రధాన చమురు దిగుమతి దేశాలకు పెద్ద ఊరటనివ్వనుంది. దిగుమతి ఖర్చులు, ద్రవ్యోల్బణం, కరెంట్ అకౌంట్ లోటుపై ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

## నౌకాయాన సామర్థ్యమే రక్షాకవచం

సైనికావసరాలు ప్రపంచానికి మార్కెట్ కారాదు

‘భారతీయ పరిశ్రమల ప్రతిభ, ఇంజినీర్ల నైపుణ్యం, కార్మికుల కఠోర శ్రమవల్లే నూతన నౌకల నిర్మాణం సాధ్యమైంది. రక్షణపరమైన కొనుగోళ్లు చేసే దేశంగానే మిగిలిపోవాలని మనం కోరుకోవడం లేదు. మన సైనిక దళాలు ప్రపంచానికి కేవలం మార్కెట్‌గా మారకూడదు. స్వయం సమృద్ధిద్వారా మన సామర్థ్యానికి గుర్తింపు లభిస్తుందే తప్ప ఇలాంటి మార్కెట్‌వల్ల కాదు. నౌకాయానంపై ఆధిపత్యం లేకుండా ఏ దేశమైనా పెద్ద శక్తిగా ఎదగజాలదు. అభివృద్ధి, రక్షణ, సుసంపన్నత అనేవి సముద్రాలతో ముడిపడి ఉంటాయి’ అని ప్రధాని చెప్పారు. లక్షల ఉద్యోగాలు సృష్టించగల సత్తా నౌకాయాన రంగానికి ఉందన్నారు. నౌకాయాన శక్తిలో తదుపరి దశలో ప్రవేశించే సమయం ఆసన్నం కావడంతో నౌకా నిర్మాణ పరిశ్రమలో నూతన దార్శనికత దిశగా పయనిస్తున్నామని చెప్పారు. ఓడరేవుల ఆధారిత ఆర్థిక వృద్ధికి సాగరమాల ప్రాజెక్టు ఉపకరిస్తుందని చెప్పారు.

## అమెరికాకు షాకిచ్చిన చైనా.. కీలక కంపెనీలపై ఆంక్షలు

చేయడాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపింది. చైనా సైన్యంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. అలీబాబా, బైడూ సహా పలు టెక్ కంపెనీలపై ఈ నెల ఆరంభంలో అమెరికా రక్షణ శాఖ నిషేధం విధించింది. ఇకపై ఆయా కంపెనీలు అగ్రరాజ్య సైనిక కాంట్రాక్టులను పొందలేవని తెలిపింది.ఈ ఏడాది మే నెలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయిన ట్రంప్.. ఇరు దేశాల మధ్య పరస్పర వాణిజ్య సహకారంపై అంగీకారానికి వచ్చారు. అయితే, నెల తిరక్కుండానే బీజింగ్ కంపెనీలపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించడం గమనార్హం. దీంతో బీజింగ్ కూడా ప్రతిచర్యలు చేపట్టింది.

## గొడ్డలి పార్టీకి తెలిసిందల్లా గంజాయి, హత్యలే: రామ్మోహన్‌నాయుడు

వంద గ్రామాలు’ ముగింపు కార్యక్రమం, కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభను పల్నాడు జిల్లా అమరావతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ ఐదేళ్ల విధ్వంసం నుంచి రాష్ట్రం ఇప్పుడే కోలుకుంటోందని, రెండేళ్లలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. ఎంత అభివృద్ధి చేశామో పుస్తకాలు వేసి చూపిస్తున్నామని, దీనిపై ఎవరైనా చర్చకు వచ్చినా సిద్ధమేనని అన్నారు. గొడ్డలి పార్టీకి గంజాయి, హత్యలే తెలుసన్నారు. మరో 30 ఏళ్లు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండాలన్నారు. నియోజకవర్గ పరిధిలో 100 గ్రామాల్లో 100 రోజులు పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను రామ్మోహన్‌నాయుడు అభినందించారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ హయాంలో సాగునీరు పారలేదని, జగన్ కల్తీ మద్యాన్ని గ్రామాల్లో పారించారని విమర్శించారు. రాజధానిగా అమరావతి చట్టబద్ధతకు మద్దతివ్వని ఏకైక పార్టీ వైకాపా అని గుర్తుచేశారు.

# దువ్వూరు ఆర్యవైశ్య సంఘం నేతలతో జిల్లా గ్రామీణ అధ్యక్షుడు వల్లంకొండు వెంకటరమణ భేటీ

**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూన్ 22)**

కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ దువ్వూరు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా దువ్వూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆరవేటి సుబ్బారావుని, పలువురు కమిటీ పెద్దలను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇరు కమిటీల నేతలు పరస్పరం శాలువాలు కప్పి ఘనంగా సత్కరించుకున్నారు.

అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు

అనంతరం స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన వల్లంకొండు వెంకటరమణ, అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు శాలువాలతో ఘన సత్కారం

అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు జిల్లా రూరల్ అధ్యక్షుడితో పాటు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఈ సీ మెంబర్ కె వి సుబ్బారావు పబ్బతి చంద్రశేఖర్, ఎలిశెట్టి ప్రసాద్ విద్యావేత్త సివి నాగేశ్వరరావు పబ్బతి సత్యనారాయణ ప్రతినిధులను శాలువాలతో సత్కరించి, అమ్మవారి శేషవస్త్రాన్ని బహూకరించారు.

జిల్లా కమిటీలో దువ్వూరు వైశ్యులకు సముచిత స్థానం

కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) నూతన కమిటీలలో దువ్వూరు గ్రామానికి చెందిన పలువురు అర్హులైన వైశ్య ప్రముఖులకు త్వరలోనే అవకాశం కల్పిస్తాం. ఇందుకు సంబంధించిన అర్హుల వివరాలను వెంటనే జిల్లా కమిటీకి పంపించాలని జిల్లా రూరల్ వైశ్య సంఘం అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు ఆర్యవైశ్య సంఘం, అమ్మవారి శాల కమిటీ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య ప్రముఖులు, యువకులు పాల్గొన్నారు. సంఘం బలోపేతానికి, సేవా కార్యక్రమాల విస్తరణకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు.














షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు     తెలుగు దినపత్రిక

22.06.26     మంగళవారం


# అవకాశాలను అందిపుచ్చుకోండి..!

- పెట్టుబడులకు విస్తృత అవకాశాలు
- ఉత్పత్తుల ఎగుమతి, రవాణాకు అందుబాటులో ఉత్తమ మార్గాలు
- ప్రకాశం జిల్లా పారిశ్రామికాభివృద్ధిలో 'కెటలిస్టు' గా మారండి
- పెట్టుబడిదారులకు కలెక్టర్ పిలుపు
- జిల్లాలోని పరిస్థితులపై స్వయంగా ప్రజెంటేషన్
- ఒంగోలులోని ఎస్‌జివిఎస్ కన్వెన్షన్ సెంటర్లో ఘనంగా 'ఎలైట్ బిజినెస్ మీట్'
- పాల్గొన్న జిల్లాలోని ప్రజాప్రతినిధులు







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 22)

ప్రకాశం జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధి శోభను సంతరించుకోనుంది. భారీ పెట్టుబడులకు ఈ జిల్లా గమ్యస్థానం కానుంది. ఇక్కడి మానవ వనరులు, సహజ వనరులను సమర్ధంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఇచ్చిన పిలుపుతో పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. స్థానిక ఎస్. జి.వి.ఎస్. కన్వెన్షన్ సెంటర్లో సోమవారం నిర్వహించిన ' ఎలైట్ బిజినెస్ మీట్ ' ఈ పెట్టుబడులకు మార్గంగా మారింది. కలెక్టర్ తో పాటు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమం ప్రకాశం జిల్లాలో ఉన్న పారిశ్రామిక అవకాశాలను పెట్టుబడిదారుల దృష్టికి తీసుకువెళ్ళింది.

**ఇది అవకాశాల ఖిల్లా...!** పెట్టుబడులు పెట్టేందుకు జిల్లాలో ఉన్న అవకాశాలను స్వయంగా కలెక్టరే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ కార్యక్రమంలో వివరించారు. ప్రకాశం జిల్లా... అవకాశాల ఖిల్లా అని పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో జిల్లా తలసరి ఆదాయం రూ.2,17,511 గా ఉందని, జిల్లా స్థూల ఉత్పత్తి రూ.73,331 కోట్లుగా నమోదయిందని తెలిపారు. వృద్ధిరేటు 15.3 శాతంగా ఉందన్నారు. జిల్లాలో రామయపట్నం పోర్టు, బీపీసీఎల్, ఇండోసోల్ కంపెనీలతోపాటు జిందాల్ స్టీల్ కంపెనీ కూడా ఐరన్ ఓర్ తవ్వకాల ప్రతిపాదనతో వచ్చిందన్నారు. మరోవైపు దొనకొండ మండలంలో 25వేల ఎకరాలతో మెగా ఇండస్ట్రియల్ పార్కు అందుబాటులో ఉందని చెప్పారు. జాతీయ రహదారులు, బెంగళూరు – కడప – విజయవాడ ఎక్స్ప్రెస్ హైవేలు రవాణా వ్యవస్థ రూపురేఖలను మార్చాయన్నారు. విస్తృత అభివృద్ధికి అవకాశం ఉన్న 20 కిలోమీటర్ల కోస్తా తీరం కూడా ప్రకాశం జిల్లా సొంతమన్నారు. ప్రపంచంలోని 50 శాతం నగరాలు సముద్రతీరం వెంబడే అభివృద్ధి చెందాయని కలెక్టర్ వివరించారు. ఈ చారిత్రక వాస్తవాలను, స్థానికంగా ఉన్న అవకాశాలను వినియోగించుకొని పెట్టుబడులతో ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సోషల్, ఇండస్ట్రియల్, సర్వీస్ రంగాలలో ఉన్న మౌలిక వసతులను వినియోగించుకుని ప్రకాశం జిల్లా పారిశ్రామిక అభివృద్ధిలో ' కెటలిస్టు' గా మారాలని పెట్టుబడిదారులను కోరారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో పారిశ్రామిక రంగానిది కీలక పాత్ర అన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ దృష్ట్యా అన్ని జిల్లాల్లోని అవకాశాలను అధికార యంత్రాంగ వినియోగించుకుంటున్నట్లు తెలిపారు.

ప్రకాశం జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలోని అవకాశాలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఏపి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా అభివృద్ధికి రామయ్యపట్నం పోర్టు, వెలుగొండ ప్రాజెక్టు కీలకం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి ఈ రెండింటినీ అందుబాటులోకి తీసుకువస్తున్నందున పారిశ్రామికవేత్తలు పెట్టుబడులతో ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రామాయపట్నం పోర్టు ఆధారంగా పెట్రో కెమికల్ పరిశ్రమలకు అవకాశం ఉందన్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడులకు కూడా ప్రకాశం జిల్లాలో అత్యధిక అవకాశాలు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ప్రత్యేక సెజ్ కూడా వచ్చే (తరువాయి 4లో...)



## సకాలంలో స్పందించారు.....

### ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తి ప్రాణాలు కాపాడిన రూరల్ ఎస్ఐ వి వేమన

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 22)

మార్కాపురం పట్టణంలో నివాసం ఉంటున్న బండి రామదాసు కుటుంబ సమస్యల కారణంగా సోమవారం సాయంత్రం సుమారు 6 గంటలకు తాను చనిపోతున్నానని చెప్పి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ఫోన్ చేసి చెప్పాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న తన స్నేహితుడు అద్దంకి మాధవ డయల్ 112కి ఫోన్ చేసి వారి ద్వారా వెంటనే మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్ అధికారులకు

## విధుల్లో నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శి సస్పెండ్

### 6 మంది బిఎల్ఓలకు షోకాజ్ నోటీసులు జారీ జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 22)

సర్ కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించిన ఒక పంచాయతీ కార్యదర్శి సస్పెండ్ చేయడంతో పాటు మరో 6 మంది బిఎల్ఓలకు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే సర్ కార్యక్రమంలో విధులు సక్రమంగా నిర్వహించక పోవడంతో పాటు, అధికారుల ఆదేశాలను దిక్కరించడంతో వారి పై చర్యలకు ఉపక్రమించారు. షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో మార్కాపురం పట్టణంలోని 2, 5, 12 సచివాలయాలకు చెందిన బిఎల్ఓలు డి పెద్ద మస్తాన్, ఎస్‌కే సల్మా, ఎం శ్వేత, మార్కాపురం రూరల్ లోని భూపతిపల్లి, రాయవరం 1 సచివాలయాలకు చెందిన జి మహేష్ రెడ్డి, కె శ్రీనివాసరావు, జి ఆంజనేయులు ఉన్నారు. అదే విధంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన పెద్దారవీడు మండలం రామాయపాలెం పంచాయతీ సెక్రెటరీ ఎస్ శ్రీనివాసులను సస్పెండ్ చేశారు. ఇప్పటికైనా బిఎల్వోలు పద్ధతి మార్చుకొని సక్రమంగా పనిచేయాలని కలెక్టర్ హెచ్చరించారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన మార్కాపురం జిల్లా కలెక్టర్, ఎస్పీ

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 22)

ఈ నెల 27వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లాలోని గిద్దలూరు మండలం కిష్టం శెట్టిపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంజీవిని డిజిటల్ నర్వ్ సెంటర్ ను ప్రారంభించనున్న నేపథ్యంలో ముందస్తుగా భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి జిల్లా అధికారులు పరిశీలించారు. హెలిప్యాడ్ ప్రదేశం, ప్రజా వేదిక, పార్కింగ్ ప్రాంతాలను, సీఎం కాన్వాయ్ రూట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు చుట్టు ఉన్న ప్రాంతములను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంకా తీసుకోవాల్సిన ఏర్పాట్లు చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ గారు వీఐపీల వాహనాల రాక, సభా స్థలంలో వేదిక, పార్కింగ్ ఏరియా, సీఎం ప్రవేశం, నిష్క్రమణ స్థలాలను, హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు ఉన్న రూట్‌ను, క్షుణ్ణంగా పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు తెలియజేశారు. ఇతర శాఖల సమన్వయంతో అన్ని చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు, ఎస్బి ఇన్స్‌పెక్టర్ యం శ్రీనివాసరావు, గిద్దలూరు అర్బన్ సీఐ కె సురేష్, రూరల్ సీఐ రామకోటయ్య, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)





## రోడ్లు ఇలా.... ప్రయాణం ఎలా..?

- అధ్వానంగా బి చర్లపల్లి....చట్లమీట్ల రోడ్డు
- దేవుడు కరుణించిన పూజారి వరం ఇవ్వడం లేదు
- వర్షం వస్తే బురదమయం.. ఎండ కాస్తే దుమ్ము

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జూన్ 22)

గ్రామీణ రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వర్షం వస్తే రోడ్ల పై బురద పేరుకుని పోతుంది... ఎండలు కాస్తే దుమ్ము రేగుతుంది. పెద్దరవీడు మండలంలో ఏ గ్రామంలో చూసిన ఇటువంటి పరిస్థితి కనిపిస్తుంది. ప్రధాన రహదారులు సైతం గుంతలు, మిట్టలు ఉండడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్ల పై ఉన్న గుంతలలో వర్షం నీరు నిలువ చేరి ఉండడంతో వాహనదారులు ఆ గుంతల్లోకి వెళ్లి ప్రమాదానికి గురైన ఘటనలు అనేకం..

పెద్దారవీడు మండల పరిధిలో బద్వీడు చర్లపల్లి నుంచి వైడిపాడు, చట్లమిట్ల వెళ్లే రోడ్డు అద్వానంగా తయారయింది. ఈ మార్గంలో అడుగడుగున గుంతలు ఏర్పడి కంకర పైకి తేలడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. గత పది రోజుల క్రితం బద్వీడు చెర్లోపల్లి.... చట్లమిట్ల... పోతంపల్లి, రేగుమనపల్లి రోడ్డు కోట్ల రూపాయలతో టెండర్ పిలవడం జరిగింది. ఈ రోడ్డు రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బద్వీడు చెర్లోపల్లి గ్రామంలో ప్రధాన రహదారి గుంతలతో ఉంది. వాటిల్లో మురుగునీరు చేరి దుర్వాసన వెలుబడుతోంది. గ్రామంలోని ఎస్సీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురికి నీరుతో రోగాల పాలవుతున్నారు.దీంతో స్థానికులు రాకపోకలు సాగేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటిలో దోమలు వృద్ధి చెందడంతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలో బద్వీడు పెగలపాడు, వైడిపాడు, చట్లమీట్ల కు వాహనాలు నిత్యం తిరుగుతున్నాయి. ఈ రహదారి నుంచి నిత్యం స్కూల్ బస్సులు కూడా తిరుగుతున్నాయి. ఈ దుస్థితిని గ్రామస్తులు టిడిపి ఇన్చార్జి ఎరిక్షన్‌బాబు దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఎరిక్షన్‌బాబు పరిశీలించి ఎస్టిమేషన్ రూ.50 లక్షలకు వేయించి మంజూరు చేయించారు. కానీ టెండర్లు పిలిచి (తరువాయి 4లో...)

# అవకాశాలను అందిపుచ్చుకోండి..!






అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ' ఈజ్ ఆఫ్ డూయింగ్ - స్పీడ్ ఆఫ్ బిజినెస్ ' విధానంతో సింగల్ విండో ద్వారా అనుమతులను త్వరగా ఇస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది డిసెంబరు లేదా వచ్చే మార్చి నాటికి గ్రీన్ పోర్టులు కూడా పూర్తవుతాయన్నారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకొని పెట్టుబడులతో రావాలని పారిశ్రామికవేత్తలకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీ.నూకసాని బాలాజీ మాట్లాడుతూ గుండాయపాలెం బీచ్ ను కేరళలోని అలెప్పీ బీచ్ మాదిరిగా అభివృద్ధికి అవకాశం ఉందన్నారు. ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కొత్తపట్నం, పాకల బీచ్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. అద్దంకి భవనాసి చెరువును అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో బోటింగ్, టెంపుల్ టూరిజం అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ రంగంలో పెట్టుబడికి ఉన్న అవకాశాలను వినియోగించుకునేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలకు ఆయన పిలుపునిచ్చారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా, మొట్ట మొదటగా ప్రకాశం జిల్లాలోనే ఇటువంటి పారిశ్రామిక వేత్తల సదస్సు పెట్టడం శుభపరిణామన్నారు. ఒంగోలు నగరాన్ని పారిశ్రామిక హబ్ గా తయారు చెయ్యటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఒంగోలులో ఇండస్ట్రియల్ మోడల్ టౌన్ షిప్స్ ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక పారిశ్రామిక వేత్తలు ప్రకాశంలో పెట్టుబడులు పెట్టి ఇక్కడ అబివృద్ధి కి పాటుపడాలని ఆయన కోరారు. ఈ పారిశ్రామిక వేత్తల సమావేశానికి వచ్చిన పారిశ్రామికవేత్తలు మొత్తం రూ.20 వేల కోట్లు పెట్టుబడి పెట్టే సామర్థ్యం ఉన్న వారన్నారు. ప్రకాశం జిల్లాలో పారిశ్రామికంగా మంచి అవకాశాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరు దానిని ఉపయోగించుకుని పెట్టుబడులు పెట్టాలన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాను సస్యశ్యామలంగా ఉంచాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరికన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాని హార్టికల్చర్ హబ్‌గా తయారు చెయ్యటానికి ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. హార్టికల్చర్, పొగాకు కోల్డ్ స్టోరేజ్‌ల నిర్మాణానికి మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ ఒంగోలులో త్వరలో ఫిషింగ్ హార్బర్, ఎయిర్ పోర్టు వస్తున్నాయన్నారు. ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 ఏళ్లు అవుతున్న సందర్భంగా నగరంలో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. హోటళ్ళు, కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్మాణాలకు ఆసక్తి ఉన్నవారు ప్రతిపాదనలతో ముందుకు రావాలని ఆయన కోరారు. నగర అభివృద్ధిలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ హోటళ్ల ప్రతినిధులు ఆసక్తి చూపారు. 150 గదులతో ర్యాడిసన్ హోటల్ ను ఒంగోలు శివారు చదలవాడలో ఏర్పాటు చేస్తున్నట్లు రవిప్రియ గ్రూప్ అధినేత కంది రవిశంకర్ చెప్పారు. అదే విధంగా నోవాటెల్ హోటల్ ను ఒంగోలులో కూడా ఏర్పాటు చేస్తామని ప్రతినిధులు చెప్పారు. ఆతిథ్య రంగంలో సేవలను పెంచుతామని కంఫర్ట్ ఇన్, క్రేజీ హైర్ హోటల్స్ ప్రతినిధులు తెలిపారు.

**మొదటి ప్రయత్నం ... దిగ్విజయం.!**

జిల్లాలో ఉన్న అవకాశాలను హై లైట్ చేస్తూ పారిశ్రామికంగా పరుగులు తీయించేలా అధికార యంత్రాంగం చేపట్టిన మొట్టమొదటి 'ఎలైట్ బిజినెస్ మీట్' కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది. ప్రకాశం జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు పలువురు పారిశ్రామికవేత్తలు తమ ఆలోచనలను, ఆసక్తిని ఈ కార్యక్రమంలో పంచుకున్నారు. జిల్లా కలెక్టర్ వాటిపై స్పష్టమైన వివరణ ఇచ్చారు. జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను వివరిస్తూ రూపొందించిన పుస్తకాన్ని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు ఆవిష్కరించారు. అంతేకాదు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ ఆసక్తిని తెలియజేసేందుకు ప్రకాశం జిల్లా అధికారిక వెబ్ సైట్ లో ప్రత్యేక పేజీని కూడా అందుబాటులో ఉంచుతామని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి , బి ఎన్ విజయ్ కుమార్, ఏలూరి సాంబశివరావు, కందుల నారాయణరెడ్డి, ప్రముఖ వైద్యురాలు, దర్శి టిడిపి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, సబ్ కలెక్టర్ డి హిమవంశి, కెమికల్స్, గ్రానైట్స్, హేచరీస్, హోటల్స్, ఆసుపత్రి రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

# పోతవరం స్మశాన బాధితులకు అండగా జనసేన

## త్వరలో మంద కృష్ణ మాదిగ పర్యటన



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 22)

పోతవరం ఎస్సీ స్మశాన స్థల వివాదం పై ఎస్సీ కమీషన్ రంగంలోకి దిగిన తర్వాత, తాజాగా జనసేన నాయకుడు హల్చల్ జహీర్ ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగను సోమవారం హైదరాబాద్‌లో కలిసి మద్దతు కోరారు. సమస్య తీవ్రతను తెలుసుకున్న మంద కృష్ణ మాదిగ త్వరలోనే స్వయంగా పోతవరం వచ్చి ఆ స్మశాన వాటికను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. బాధితులకు న్యాయం జరిగే వరకు జనసేన పోరాటం కొనసాగుతుందని జహీర్ తెలిపారు.

# జిజిహెచ్ ప్రాంగణంలో ప్రధాన మంత్రి దివ్యాంగ కేంద్రం

**రాష్ట్రంలో 6 కేంద్రాలను ఏర్పాటు**

**ఒంగోలు జిజిహెచ్‌కు ఒకటి కేటాయింపు**

**మంత్రి స్వామిని కలిసి కేంద్ర ఏర్పాటును వివరించిన జిజిహెచ్ ఇంచార్జి సూపరింటిండెంట్**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 22)

జిజిహెచ్ ప్రాంగణంలో ప్రధాన మంత్రి దివ్యాంగ కేంద్రాలు రాష్ట్రంలో 6 ఏర్పాటు చేస్తుండగా అందులో ఒకటి ఒంగోలు జీజీహెచ్ లో ఏర్పాటు చేస్తున్నారని, ఇందుకు అనువైన స్థల పరిశీలన జరిపి, అధికారులకు నివేదిక పంపామని జిజిహెచ్ ఇంచార్జి సూపరెంటెండెంట్ డాక్టర్ ఎన్ కిరణ్ కుమార్ తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలు, సహాయక పరికరాలు, పునరావాస సేవలు, ఇతర మద్దతు సౌకర్యాలను ఒకే చోట సులభంగా అందించడమే ఈ ప్రధాన మంత్రి దివ్యాంగ కేంద్రం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో ప్రధానమంత్రి దివ్యాంగ కేంద్రం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించేందుకు ఒక ఉన్నత స్థాయి బృందం సోమవారం ఆసుపత్రిని సందర్శించింది. ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులతో కూడిన ఈ ఉమ్మడి బృందానికి, జిజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ సువార్తమ్మ, ఏఎల్ఐఎంసీవో ప్రతినిధి రాజబాబు, సిఎస్ఆర్ఎమ్ఓ డాక్టర్ బి మాధవీలత, ఏపీఎస్ఎంఐడీసీ అధికారులతో ప్రాంగణంలోని పలు ఖాళీ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వికలాంగులకు సులభంగా అందుబాటులో ఉండేలా, అవసరమైన మౌలిక సదుపాయాలు సేవలు అందించడానికి అనుకూలంగా ఉండే ప్రదేశాలపై క్షుణ్ణంగా చర్చించారు. ఇదే విషయాన్ని మంత్రి డా డోలా బాల వీరాంజనేయస్వామి, జిల్లా కలెక్టర్ పి రాజాబాబును కలిసి వివరించినట్టు తెలిపారు. దివ్యాంగుల సంక్షేమశాఖ ఏఎల్ఐఎంసీవో వారితో సమన్వయం చేసుకొని అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి సూచించారని తెలిపారు.

# సకాలంలో స్పందించారు.....

సమాచారం తెలియజేశారు. మార్కాపురం డీఎస్పీ యు నాగరాజు, సీఐ అల్తాఫ్ హుస్సేన్ ఆదేశాల మేరకు రూరల్ ఎస్ఐ వి వేమన, సిబ్బంది, ఐటీ కోర్ టీం సాయంతో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి బండి రాములు ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. వెంటనే రైల్వే ట్రాక్ వద్దకు చేరుకొని అతని ప్రాణాలను కాపాడడం జరిగింది. ఆ తర్వాత అతనికి కౌన్సిలింగ్ నిర్వహించి, మానసికంగా ధైర్యం చెప్పి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వెంటనే స్పందించి సదరు వ్యక్తి యొక్క ప్రాణాలను చాకచక్యంతో కాపాడిన రూరల్ ఎస్ఐ వి వేమన, ఇతర పోలీసు సిబ్బందికి అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. విధి నిర్వహణలో మంచి పనితీరు కనబర్చిన మార్కాపురం రూరల్ ఎస్ఐ వి వేమన, హెూంగార్డు నోవా, డ్రైవర్ బాషా, ఐటి కోర్ సిబ్బందిని మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు అభినందించారు.

# రోడ్లు ఇలా.... ప్రయాణం ఎలా..?



నెల రోజులు అవుతున్నప్పటికీ కూటమి నాయకులకు పొత్తులు పోక గ్రామస్తులను ఇబ్బందులకుగురి చేస్తున్నారు. నాయకుల ప్రలోభాల వల్ల రూ.50 లక్షల సిసి రోడ్డు వెనక్కి వెళ్లే ఆలోచన దారితీస్తుందని గ్రామస్తులు గుసగుసలాడుతున్నారు. తక్షణమే ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పరిశీలించి గ్రామస్తులకు తగు న్యాయం చేయాలంటూ ప్రజలు కోరుతున్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన మార్కాపురం జిల్లా కలెక్టర్, ఎస్పీ










# ఏలూరి కృషితో ఇంకొల్లులో ఆర్టీసీ డిపో ఏర్పాటుకి కలెక్టర్ వినోద్ కుమార్ గ్రీన్ సిగ్నల్



(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, జూన్ 22)





ఇంకొల్లులో బస్సు డిపో ఏర్పాటు చేయాలని గత పాలకులు శంకుస్థాపనలు చేసి నిధులు మంజూరుకు చేయకపోవడంతో డిపో అభివృద్ధి కుంటుపడింది. 1993వ సంవత్సరంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వము ఒంగోలు గుంటూరు జంక్షన్ పాయింట్‌గా ఇంకొల్లులో ఆర్టీసీ డిపో నిర్మాణంకు నాటి పాలకులు శంకుస్థాపన చేశారు. నాటినుండి నిధులు మంజూరు చేయకపోవడం అనేక సమస్యలు ఎదుర్కోవటం జరిగింది. 30 సంవత్సరాలు దాటిన సమస్యపై నాటి పాలకులు దృష్టి సారించకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. పర్చూరు నియోజకవర్గం 150 గ్రామాలతో కూడుకొని ఉంది పూర్తిస్థాయిలో రవాణా సౌకర్యము లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరము ఇంకొల్లులో దగ్గుపాటి విద్యాసంస్థల్లో ఓ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఇంకొల్లుకు వచ్చారు. ఆ సమయంలో ఇంకొల్లు మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షులు అన్నం బోట్ల మోహన్ కృష్ణ ఇంకొల్లులో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని అదేవిధంగా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయనకు వినతి పత్రం ఇచ్చారు. సంవత్సర కాలంగా పరిశీలన అనంతరం ఇంకొల్లులో 50 విద్యుత్ బస్సులతో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేస్తామని బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ మోహన కృష్ణకు తెలియజేశారు. మొదట పర్చూరు నియోజకవర్గంలోని రవాణా సమస్యపై పూర్తి సమాచారంను శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుకు వినతి పత్రం రూపంలో మోహన్ కృష్ణ అందజేశారు. బాపట్ల జిల్లా కలెక్టర్ ప్రధాన ప్రజా సమస్యపై దృష్టి సారించి స్వయంగా పరిశీలించారు. దీంతో సమస్యకు పరిష్కారం దొరికింది ఆర్టీసీ అధికారులను పూర్తిస్థాయిలో బాపట్ల జిల్లా అభివృద్ధి చేసే విధంగా కృషి చేయాలని ఆయన ఆదేశించారు.బాపట్ల జిల్లా రవాణా శాఖ అధికారి విమల ఇంకొల్లులో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు విద్యుత్ బస్సుల ద్వారా సాధ్యమవుతుందని నివేదిక ప్రభుత్వానికి పంపినట్లు ఆమె తెలియజేశారు .ఏది ఏమైనా శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు కృషితో దీర్ఘకాలంగా ఆగిపోయిన ఇంకొల్లు ఆర్టీసీ డిపో ఎట్టకేలకు ఆయన కృషి ఫలించింది. ఇంకొల్లు బస్సు డిపో ఏర్పాటుతో ఈ ప్రాంత రూపు రేఖలు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు మారనున్నాయి. త్వరలో ఇంకొల్లులో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయనున్నట్లు బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ రెండు సంవత్సరాల విజయోత్సవ సభలో బాపట్ల ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి సాక్షిగా ఆయన ఈ సమాచారం మోహన్ కృష్ణకు తెలియజేశారు. ఇంకొల్లులో బస్సు డిపో ఏర్పాటు చేయడం పట్ల రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుకు బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌కు మోహన్ కృష్ణ,మండలంలోని పలువురు ప్రముఖులు ధన్యవాదాలు తెలిపారు.

# మొక్కుబడిగా మండల సమావేశం



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 22)

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ కొండా బత్తిన మాధవ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జడ్పిటిసి బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో డాక్టర్ పి సుజాత, తాసిల్దార్ వి పుల్లారావు హాజరయ్యారు. అధికారులు తమ శాఖల ద్వారా జరిగే పథకాలు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా గంటలోపే సమావేశాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రామాంజనేయులు, పిఎసిఎస్ అధ్యక్షుడు మన్నెం రమణయ్య, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# క్రాంతి మాదిగ బలవన్ మరణం కేసులో పోలీస్ అధికారుల పై కేసు నమోదు చేయాలి










**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 22)**

విజయవాడలో కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీఐ నాగరాజు వేధింపులకు, పోలీస్ టార్చర్‌కు గురై బలవన్ మరణం చెందిన పేరిపోగు క్రాంతి కుమార్ కేసును బీఎన్ఎస్ 108, ఎస్సీ ఎస్టీ యాక్ట్ 3(2)ఏ గా మార్చాలని విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబుకు దళిత సంఘ నాయకులు కొరివి వినయ్ కుమార్, నీలం నాగేంద్రరావు, ఆంధ్ర మాల్యాద్రి, కరువాది సుబ్బారావు, ఏవి పటేల్, శంకర్ నాయక్ లు ఫిర్యాదు చేశారు. సోమవారం విజయవాడ పోలీస్ కమిషనరేట్ లో కమిషనర్ను కలిసి క్రాంతి కుమార్ మాదిగ అనే యువకుడు అవుతున్న వీడియో వైరల్ అయి పది రోజులు అవుతున్న పోలీస్ అధికారులు సెక్షన్ ఆల్టర్ చేయలేదన్నారు. వాస్తవానికి విజయవాడలోనే కృష్ణలంక పోలీస్ స్టేషన్ లో సాయి కృష్ణ అనే కాపు యువకుడిని చంపి శవాన్ని మాయం చేసిన ఘటనలో బీఎన్ఎస్ 103 హత్య కేసుగా మార్చిన పోలీస్ అధికారులు క్రాంతి మాదిగ పోలీస్ ప్రేరేపిత బలవన్ మరణం కేసులో సెక్షన్లు ఎందుకు మార్చలేదన్నారు. ఒకే పోలీస్ స్టేషన్లో ఒకే సర్కిల్ ఇన్స్పెక్టర్ వలన జరిగిన హత్య, బలవన్ మరణం కేసుల్లో కాపు కులానికి చెందిన సాయి కృష్ణ కేసులో అమలైన చట్టం క్రాంతి మాదిగ విషయంలో అమలు కాలేదు అన్నారు. అంతట విజయవాడ కమిషనర్ రాజశేఖర్ బాబు పేరు పోగు క్రాంతి కుమార్ కేసును ఉత్తర ఐజా సత్యానంద్ కు అప్పగించామని దళిత సంఘ నాయకులకు తెలిపారు. అలాగే కేసు గురించి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ తో చర్చించాలని దళిత నాయకులకు సూచించారు. అంతట డిప్యూటీ కమిషనర్ సరిత దళిత నాయకులను తన చాంబర్ కు తీసుకువెళ్లి క్రాంతి కుమార్ బలవన్ మరణం కేసులో దళిత నాయకులతో చర్చించారు. సాయి కృష్ణ కేసులో స్పందించిన "సిట్"వేసిన ప్రభుత్వం క్రాంతి కుమార్ కేసులో కనీసం సెక్షన్ కూడా ఆల్టర్ చేయలేదన్నారు. క్రాంతి కుమార్ తండ్రి పేరు పోగు వెంకటేశ్వరరావు తెలుగుదేశం పార్టీకి అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి సన్నిహితుడు అని కూటమి ప్రభుత్వానికి ప్రచారం చేశాడని కానీ మాదిగ కులం అనే ముఖ్యమంత్రి కానీకూ టమి నాయకులు గానీ పేరు పోగు వెంకటేశ్వరరావుని పరామర్శించలేదన్నారు. కాపు సాయి కృష్ణ కేసులో స్పందించిన ప్రభుత్వం పోలీసు అధికారులు పేరు పోగు క్రాంతి కుమార్ విషయంలో కూడా స్పందించాలన్నారు. అంతట డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సరిత ఈ కేసును విచారిస్తున్న ఉత్తర ఐజా కి తగు ఆదేశాలిచ్చి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తదనంతరం దళిత నాయకులు అందరూ క్రాంతి కుమార్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇంతలో మాజీ ఎంపీ జివి హర్ష కుమార్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, తదితరులు క్రాంతి కుమార్ ఇంటికి వచ్చి నివాళులర్పించారు. ఆ తరువాత దళిత నాయకులు విజయవాడలోని ఎస్సీ కమిషన్ కార్యాలయానికి వచ్చి చైర్మన్ అందుబాటులో లేకపోవడంతో ఎస్సీ కమిషన్ డైరెక్టర్ జీవపుత్ర కుమార్ కు క్రాంతి మాదిగ పోలీస్ ప్రేరేపిత బలవన్ మరణం కేసులో చట్ట ప్రకారం సెక్షన్లు మార్పించాలని ఫిర్యాదు చేశారు. అనంతరం దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్ ఎస్సీ కమిషన్ చైర్మన్ కు జవహర్ కు ఫోన్ చేయగా తాను బుధవారం క్రాంతి కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తానని చట్ట ప్రకారం ఎస్సీ కమిషన్ తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విజయవాడ పోలీస్ కమిషనర్ మరియు ఎస్సీ కమిషన్ కు ఫిర్యాదు చేసిన వారిలో కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కరువాది సుబ్బారావు దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు మాదిగ ఫౌండేషన్ చైర్మన్ ఏవి పటేల్ డి బిఎఫ్ నాయకులు మేళం భాగ్య రావు ఎస్టీ కమిషన్ మెంబర్ శంకర్ నాయక్ మాదిగ పరిరక్షణ సమితి కన్వీనర్ పత్రా బంగారం మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య కార్యదర్శి కాకుమాను రవి తదితరులు కూడా పాల్గొన్నారు.

## ఎంపీడీలతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 22)**

గిద్దలూరు ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీడీవోలతో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే నీటి వనరుల స్థితిగతులు, బోర్‌వెల్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్‌ల నిర్వహణపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఎక్కడైనా నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసే విధంగా కార్యాచరణ సిద్ధం చేసి ప్రజలకు నీటిపై ఎటువంటి ఇబ్బందులున్నా వెంటనే పరిష్కారం చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే గ్రామ సచివాలయలు సందర్శించి సిబ్బంది పనితీరు మెరుగుపడేలా చూడాలని ఎంపీడీవోలకు ఎమ్మెల్యే సూచనలు చేశారు. ఈ సమావేశంలో 6 మండలాల ఎంపీడీవోలు పాల్గొని మండలాల వారీగా తాగునీటి సరఫరా పరిస్థితులను ఎమ్మెల్యేకి వివరించారు. ఎమ్మెల్యే అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు తెలిపారు.

## రైతులు డిమాండ్ ఆధారిత పంటలు వేసుకోవాలి






**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 22)**

రైతులు వ్యవసాయంలో మేలైన సాంకేతిక పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సంచాలకులు ప్రత్యేక అధికారి ఈ నిర్మల కుమారి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహ సమీపంలో సోమవారం వ్యవసాయ అధికారి వి రాము ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. నిర్మల్ కుమారి మాట్లాడుతూ రైతులు డిమాండ్ ఆధారిత పంటలు వేసుకోవాలని, నీటిని ఆదా చేసే తక్కువ కాలపరిమితి గల పంటలను వేసుకొని ఎల్‌నీనో ప్రభావం ద్వారా వర్ష భావన పరిస్థితుల వల్ల నీటిని ఆదా చేసుకోవాలని తెలిపారు. రైతులు ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా నమోదు చేసుకొని ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, విత్తనాలు, ఎరువులు 15 రకాల సేవలు యాప్ లో అందుబాటులో ఉంటాయని అన్నారు. రాము మాట్లాడుతూ మండలంలో పచ్చిరొట్ట ఎరువులైన జలుములు 50% రాయితీతో 173 క్వింటాలు రైతుల పేర్లు నమోదు చేసి పంపిణీ చేసినట్లు తెలిపారు. కావలసిన రైతులు రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండవ ప్రసాద్, మండవ మురళీకృష్ణ, వ్యవసాయ సహాయకులు టీవీ వెంకటనారాయణ వ్యవసాయ సిబ్బంది అనూష, లక్ష్మి, మందాకిని, తదితరులు పాల్గొన్నారు.

## మార్టూరు, యద్దనపూడి, ఇంకొల్లు మండలాల్లో ఎమ్మెల్యే ఏలూరి విస్తృత పర్యటన

రైతులు, మహిళలు, చిన్నారులతో మమేకం
పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచన
రైతన్న మీకోసం పోస్టర్ ఆవిష్కరణ
గన్నవరంలో రచ్చబండ నిర్వహించిన ఎమ్మెల్యే ఏలూరి
సమస్యల పరిష్కారానికి తక్షణ ఆదేశాలు





**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జూన్ 22)**

నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం విస్తృతంగా పర్యటించారు. మార్టూరు, యద్దనపూడి, ఇంకొల్లు మండలాల్లో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, సామాజిక, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్టూరులో ఆర్యవైశ్య సంఘ నాయకులతో ఎమ్మెల్యే ఆత్మీయంగా సమావేశమయ్యారు. అనంతరం స్థానిక రైతు, పారిశ్రామికవేత్త దండా శ్రీనివాసరావుకు చెందిన శ్రీ వీరాంజనేయ వెజిటేబుల్ టొబాకో నర్సరీని పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. మార్టూరులోని శివ ఐ క్లినిక్ అండ్ ఆప్టికల్స్‌ను సందర్శించిన ఎమ్మెల్యే, ప్రజలకు మెరుగైన నేత్ర వైద్య సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. యద్దనపూడి మండలం గన్నవరం గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కేంద్రం పరిసరాలను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతపై ఆరా తీసి, మెనూను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. గన్నవరంలో ప్రజలతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులను సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇంకొల్లు మండలం గన్నవరం, గొల్లపాలెం గ్రామాల్లో నిర్వహించనున్న 'రైతన్న మీకోసం, ఇంటింటి ప్రచార కార్యక్రమం' పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ప్రభుత్వ వ్యవసాయ, సంక్షేమ పథకాలపై రైతులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు





## ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యం

మీ కోసం కార్యక్రమం నిర్వహించిన
మార్కాపురం జిల్లా పోలీసులు
ప్రజా సమస్యల పరిష్కార వేదిక
కార్యక్రమానికి 39 ఫిర్యాదులు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 22)**

జిల్లా ప్రజల నుండి వివిధ రకాల ఫిర్యాదులను పరిష్కరించి బాధితులకు న్యాయం అందించాలనే లక్ష్యంతో, మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో "మీకోసం" ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని మార్కాపురం డీఎస్పీ యు నాగరాజు, పోలీస్ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల వ్రాతపూర్వక వినతులను స్వీకరించి పోలీసు అధికారులు, వారితో నేరుగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, చట్ట పరిధిలో విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా, కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదుల వివరాలను సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు తెలియపరిచి, ప్రతి ఫిర్యాదిపై త్వరితగతిన విచారణ చేపట్టి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేదా అలసత్వానికి తావు లేకుండా నిర్ణీత గడువులో చర్యలు పూర్తి చేయాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయానికి వ్యక్తిగతంగా హాజరుకాలేని ప్రజలు తమ ఫిర్యాదులను సమీపంలోని పోలీసు స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలు లేదా సబ్-డివిజన్ కార్యాలయాల ద్వారా కూడా అందజేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివాదాలు, చీటింగ్, కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో మార్కాపురం సిఐ అల్తాఫ్ హుస్సేన్, పామూరు సీఐ వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం దృష్టికి మాజీ సైనికుల సంక్షేమ పథకాలు జేఏసీ మీటింగ్‌లో నిర్ణయం



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 22)

ముఖ్యమంత్రి గిద్దలూరు ప్రాంతాన్ని ఈ నెల 27న వస్తున్న సందర్భంగా ఈ ప్రాంతం అభివృద్ధి గురించి, మాజీ సైనికుల సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే, ముఖ్య మంత్రి దృష్టికి తీసుకు వెళ్ళాలని నిర్ణయించారు. ముఖ్య మంత్రితో వ్యక్తిగతంగా కలిసి, వినతి పత్రం ఇవ్వడానికి, ఎమ్మెల్యేని కలిసి అపాయింట్మెంట్ తీసుకుంటామని తెలిపారు. మాజీ సైనికులు కార్పొరేషన్ ఏర్పాటు, మార్కాపురం జిల్లాకు జేఎస్‌డబ్ల్యూవో స్టాఫ్ ఏర్పాటు, రేషన్ కార్డు తో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయుట, మాజీ సైనికుల ఉపాధి కోసం ఆంధ్రప్రదేశ్ లోని దేవాలయాల లో సెక్యూరిటీ స్టాఫ్‌గా మాజీ సైనికులను నియమించుట, స్వర్ణ, వార్డులో మాజీ సైనికులకు మేల్ పోలీస్ క్రియేట్ చేసి, మాజీ సైనికులను నియమించుట, కేంద్రీయ విద్యాలయం, ఎన్‌సీసీ యూనిట్ కేంద్రీయ సంస్థల ఏర్పాటు చేయుట, తిరుమలలో మాజీ సైనికులకు సుపతం పథకం వర్తింపజేయాలని సమస్యలను విన్నవిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ జి అకన్న, వైస్ చైర్మన్ కోటారెడ్డి, సీహెచ్ లక్ష్మన్‌బాబు, కన్వీనర్ పి శ్రీనివాసులు, ఎస్ వేణుగోపాల్,అడ్వైజర్ ఎం డేవిడ్, కేపీ వెంకటేశ్వర్లు, జి అంకయ్య, డి నాగేంద్ర ప్రసాద్ (ఎగ్జిక్యూటీవ్ మెంబర్) పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

(షణ్ముఖ వెలుగు, పామూరు, జూన్ 22)

మండలంలోని వరికుంటపాడు ఎంఆర్వో ఆఫీసు సమీపంలో సోమవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని ఆసుపత్రికి తీసుకువెళ్లగా భార్య, భర్త చనిపోయినట్లు డాక్టర్‌లు నిర్ధారించారు. మృతులను పామూరు మండలం బొట్లగూడూరు రఘునాదపురానికి చెందిన జయంపు వెంగయ్య, తిరుపతమ్మగా గుర్తించారు. చిన్నారికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. తనకి ఆకలి వేస్తుందన్న చిన్నారి మాటలు కంటతడి పెట్టించాయి.

## ఘనంగా అంగన్వాడీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 22)

అంగన్వాడి విద్య పూర్తి చేసుకొని ఒకటవ తరగతిలో అడుగుపెడుతున్న చిన్నారులకు సోమవారం నేతపాలెం, తూర్పు పాలెం అంగన్వాడి సెంటర్‌ల నందు మహిళా శిశు సంక్షేమశాఖ సిడిపిఓ సుధా భారతి చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులకు చక్కగా యాప్రాన్లు, క్యాప్ లను తొడిగి వారికి అభినందనలు తెలియజేశారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ముస్తాబు అనేటువంటి కార్యక్రమం ద్వారా చిన్నారులకు అంగన్వాడీలో చేరిన నాటి నుండే అద్దం ముందు పిల్లలు ఎలా ముస్తాబవ్వాలి, తల ఎలా దువ్వు కోవాలి, పౌడర్ ఎలా పూసుకోవాలి అనేటువంటి ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా రూపొందించినట్లు సుధా మారుతి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారులు ఒక క్రమశిక్షణకు,పరిశుభ్రతకు అలవాటు పడతారని తెలిపారు.అనంతరం నూతనంగా అంగన్వాడీలో చేరుతున్న మరో ఇద్దరు చిన్నారులను స్వాగతిస్తూ చప్పట్లు ద్వారా హర్షద్వానాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సుధా భారతి, సూపర్వైజర్ సుభాషిణి, అంగన్వాడి వర్కర్లు శోభ, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రాధాన్యం

### దర్శిలో ప్రత్యేక 'పోలీస్ మీకోసం' కార్యక్రమం నిర్వహించిన ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు మీ కోసం కార్యక్రమానికి 69 ఫిర్యాదులు







(షణ్ముఖ వెలుగు, దర్శి, జూన్ 22)

ప్రజా ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించడం, పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం లక్ష్యంగా జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు, పోలీస్ అధికారులు సోమవారం దర్శి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శి పట్టణం మరియు చుట్టూ పక్కల ప్రాంతాల నుంచి వివిధ సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను ఎస్పీ స్వీకరించి, తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడిన ఎస్పీ వారి సమస్యల పూర్వాపరాలను సమగ్రంగా తెలుసుకుని, వాటిని చట్టపరంగా పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అనంతరం ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మీ కోసం కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన న్యాయం అందించాలన్నారు. ఫిర్యాదులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కావున ఆ పిర్యాదులపై తీసుకున్న చర్యలపై కూడా నివేదిక ఇవ్వవలసిందిగా పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పోలీసు వ్యవస్థను ప్రజలకు మమేకం చేయడంలో భాగంగా ఈ ప్రత్యేక మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, దర్శి పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజలు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు వారి సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాల నుండి వ్యయప్రయాసలు పడి ఒంగోలులోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి రాకుండా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ప్రతి సోమవారం ఆల్టర్నేట్‌గా అన్ని సబ్ డివిజన్ పరిధిలో మీకోసం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అదే విధంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో కూడా యథావిధిగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మీకోసం ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిచ్చి పూర్తి స్థాయి విచారణ జరిపి సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు న్యాయం అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ పోలీస్ శాఖ అందుబాటులో ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక మీకోసం కార్యక్రమంలో కుటుంబ కలహాలు, చీటింగ్, భర్త, అత్తారింటి వేధింపులు, భూ, ఆస్థి వివాదాలు, ఇతర సమస్యల పై ఫిర్యాదులు అందాయి. అదే విధంగా ప్రకాశం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, సింగరాయకొండ సిఐ శ్రీహరి నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి 65 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో దర్శి డిఎస్పీ బాలమురళికృష్ణ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, దర్శి సీఐ రామారావు, అద్దంకి అర్బన్ సీఐ సుబ్బరాజు, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, చీమకుర్తి సీఐ ప్రసాద్, సబ్ డివిజన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

## వ్యక్తిగత రక్త పరీక్షలు చేపించుకోవటం చాలా అవసరం

### ప్రకాశం జిల్లా క్షయ, ఎయిడ్స్ అధికారి డాక్టర్ బాలాజీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 22)

సమాజంలో ప్రతి వ్యక్తి తప్పనిసరిగా ఎప్పటికప్పుడు వ్యక్తిగత రక్త పరీక్షలు చేపించుకోవటం చాలా అవసరమని, దీనివల్ల మనిషిలో ఉన్నటువంటి మనకు తెలియకుండా దాగి ఉండే వ్యాధుల నిర్ధారణ అనకు తెలుస్తుందని తద్వారా మనం ఆ వ్యాధికి సంబంధించిన చికిత్స చేయించుకోవడం చాలా అవసరమని ప్రకాశం జిల్లా క్షయ, ఎయిడ్స్అధికారి డాక్టర్ బాలాజీ పేర్కొన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ప్రకాశం జిల్లా వైద్యారోగ్య శాఖ జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమగ్రంగా కౌన్సిలింగ్ టెస్టింగ్ సెంటర్(ఐ.సి.టిసి) నాగులుప్పలపాడులో ఈ టెస్టింగ్ వాహనాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సంచార వాహనం ద్వారా నాగులపులపాడు బస్టాండ్ ప్రాంతంలో మండలంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రజలకు స్వచ్ఛంద రక్త పరీక్షలు నిర్వహించడం జరిగింది. దీని ముఖ్య ఉద్దేశం హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి అనేది సమాజంలో రోజురోజుకీ ప్రజలకు వ్యాప్తి చెందుతుందని, చాలామంది ఈ వ్యాధి సోకిన తర్వాత కూడా వారికి వ్యాధి సోకిందనే విషయం తెలియక సరైన వైద్య సేవలు అందుకోలేకపోతున్నారన్నారు. చాలా మంది హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి సోకిందనే తెలీగానే మానసిక ఆందోళనకు గురై వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి అనేది అంటువ్యాధి కాదని అంటించుకునే వ్యాధిని అటువంటి వారికి మానసిక స్థాయిని కలిగిస్తూ వారికి వ్యాధి పై సమగ్రమైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరి పై ఉందని ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ సమీకృత వ్యూహం,





దిష క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఎస్ కె అమీన్ పేర్కొన్నారు. ప్రభుత్వం అనేక ప్రభుత్వ హాస్పటల్లో వ్యక్తిగత పరీక్షలు, కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. వాటి ద్వారా వారికి వైద్య సేవలు, కౌన్సిలింగ్ ఇవ్వబడుతుందని తెలిపారు. దీని పై సమాజంలో ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాల్సిన బాధ్యత ఉందని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ పేర్కొన్నారు. ఈ వ్యక్తిగత సమగ్ర రక్త పరీక్షల నిర్వహణలో కౌన్సిలర్ టి విజయకుమార్, ల్యాబ్ టెక్నీషియన్ దుర్గాబాయి, సంచార హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం మేనేజర్ బి దుర్గా సురేంద్ర, ఏఎన్ఎం విజయలక్ష్మి, నాగులప్పలపాడు అవుట్ రీచ్ వర్కర్ ఎం మల్లేశ్వరి, పిఈలు పాల్గొన్నారు.

## వయ్యకల్లు గ్రామంలో వైసీపీ నుండి టీడీపీలో చేరిక

### పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 22)

వినుకొండ నియోజకవర్గం లోనిశావల్యాపురం మండలం వయ్యకల్లు గ్రామానికి చెందిన యూనిట్ ఇంచార్జ్ గోనుగుంట్ల వెంకట్రావు ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాల వారు వైసీపీ నుండి తెలుగుదేశం పార్టీలో చేరారు. చీఫ్ విప్ కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్ విప్, శ్రీ జీవీ ఆంజనేయులు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, నియోజకవర్గంలో జరుగుతున్న అద్భుతమైన అభివృద్ధిని చూసి ఆకర్షితులమై తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు. ౨గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదని, కేవలం అవినీతి సంపాదనపైనే ఆ ప్రభుత్వం దృష్టి పెట్టిందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తీవ్రంగా విమర్శించారు.చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని, కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సూపర్ సిక్స్' పథకాలు సూపర్ హిట్ అయ్యాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో దళితులకు ఒక్క సబ్సిడీ లోన్ కానీ, ఇళ్లు లేని పేదలకు ఇళ్లను కానీ మంజూరు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. జగన్ మోహన్ రెడ్డి పాలన నచ్చకే ప్రజలు గత ఎన్నికల్లో బుద్ధి చెప్పారని, గతంలో 151 సీట్లు ఉన్న వైసీపీని కేవలం 11 సీట్లకు పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. ప్రజలు కూటమిని 94 శాతం స్ట్రైక్ రేట్‌తో అఖండ మెజారిటీతో గెలిపించారని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్డీయే ప్రభుత్వం అండగా ఉంటుందని జీవీ ఆంజనేయులు హామీ ఇచ్చారు. ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వ పరంగా ఇళ్లను నిర్మించి ఇస్తామని, భవిష్యత్తులో మూడు సెంట్ల స్థలాన్ని కూడా అందిస్తామని స్పష్టం చేశారు.60 ఏళ్లు నిండిన వృద్ధులకు, వికలాంగులకు, భర్త చనిపోయిన మహిళలకు రాబోయే రెండు మూడు నెలల్లోనే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 లక్షల మందికి పైగా కొత్త పెన్షన్లను మంజూరు చేయబోతున్నట్లు వెల్లడించారు.నియోజకవర్గంతో పాటు గ్రామాల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వంతో కలిసి ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో ఎన్డీయే పాలన మరో 20 ఏళ్ల పాటు నిరంతరాయంగా కొనసాగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, గ్రామ పార్టీ అధ్యక్షులు నడింపల్లి శ్రీను బాబు,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యం

### కూటమి ప్రభుత్వ పాలనలో మెరుగైన నాణ్యమైన రోడ్లు

### రూ.5.80 కోట్లతో ఆర్అండ్‌బీ రహదారుల పనులకు

### ఎమ్మెల్యే ఏలూరి శంకుస్థాపన





(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జూన్ 22)

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన రోడ్ల నిర్మాణానికి పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. మార్టూరు, గన్నవరం గ్రామాల్లో సోమవారం గ్రామస్తుల సమక్షంలో రూ.5.80 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆర్అండ్‌బీ రహదారుల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శంకుస్థాపన పలకలను ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దెబ్బతిన్న రహదారుల కారణంగా గత కొన్నేళ్లుగా ప్రజలు, రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్ల మరమ్మతులు, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి నిధుల మంజూరుకు ప్రత్యేక కృషి చేసినట్లు చెప్పారు.ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో చేపట్టనున్న ఈ పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల్లో రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు కూడా అనుకూలంగా మారుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. రహదారుల అభివృద్ధి పనులు ప్రారంభం కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# దర్శి సబ్ డివిజన్ పోలీస్ స్టేషన్ల పనితీరు పై సమీక్ష

**పెండింగ్ కేసుల పై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పరిష్కరించాలి**
**మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యతనిచ్చి**
**వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించండి**
**రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు మరింత ప్రత్యేక చర్యలు తీసుకోవాలి**
**ఎన్ఫోర్స్మెంట్‌ను పెంచి చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలి**
**జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు**



**(షణ్ముఖ వెలుగు, దర్శి, జూన్ 22)**

పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. దర్శి సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరుపై, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాలు, చీదీఔం,డిపిఓ పెండింగ్ రిప్లయ్స్ పై జిల్లా ఎస్పీ సోమవారం దర్శి పోలీస్ స్టేషన్‌లో డిఎస్పీ, సీఐలు, ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్పీ పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి, కేసుల ఛేదింపునకు మరియు పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు మరియు మెళకువలను అధికారులకు దిశా నిర్దేశాలు చేశారు. పోలీస్ స్టేషన్ల వారీగా యూఐ కేసులు తగ్గించుకోవాలని, వీలైనంత త్వరగా పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలని, అరెస్టులు, చార్జ్ షీట్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకోని ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలని, చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచి కట్టడి చెయ్యాలన్నారు. అలాగే గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి కేసుల నమోదులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పేకాట, కోడి పందాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ప్రజా ప్రశాంతతకు భంగం కలిగించే అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, వారిని బైండ్ ఓవర్ చేయాలనీ, బైండవర్ ఉల్లఘించిన వారిపై తగ్గు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. అలాగే ప్రతి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా మహిళా, పిల్లలు భద్రత, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నియమాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, చట్టాలు, శిక్షలపై అవగాహన వంటి అంశాల పై ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రకాశం, మార్కాపురం రెండు జిల్లాల వ్యాప్తంగా 220 కుంభాకార దర్పణాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో బ్లాక్ స్పాట్లు, ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రదేశాలలో కుంభాకార దర్పణం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సర్వీస్ రోడ్డు నుండి జాతీయ రహదారిపై ప్రవేశించే సమయంలో తప్పనిసరిగా వాహనాన్ని ఆపి, ఇరువైపులా పరిశీలించి తర్వాత మాత్రమే ముందుకు సాగాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు డ్రైవ్ చేసే వారు సీట్ బెల్ట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదమని, ఇది మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు కలిగిస్తుందని హెచ్చరించారు. ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే ప్రదేశాలను గుర్తించి ప్రజల, మునిసిపల్ కార్మికుల వారి సహకారంతో వాటిని శుభ్రం చేయించటం జరిగిందని, అలా చేయటం ద్వారా న్యూసెన్స్ తగ్గి శారీరిక నేరాలు తగ్గాయన్నారు. గతంలో కంటే ప్రస్తుతం నేరాలు తగ్గుముఖం పట్టిందన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే అలాంటి వారి పై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దర్శి డిఎస్పీ బాలమురళి కృష్ణ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్బి సిఐ దేవ ప్రభాకర్, దర్శి సీఐ రామారావు, అద్దంకి అర్బన్ సీఐ సుబ్బరాజు, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, చీమకుర్తి సీఐ ప్రసాద్, సబ్ డివిజన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో రోటరీ క్లబ్ తోడ్పాటు అభినందనీయం

**మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**







**(షణ్ముఖ వెలుగు, కొండపి, జూన్ 21)**

సామాజిక బాధ్యతగా ప్రజలకు రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం కొండపి మండలం ఎస్సీ కాలనీలో రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆర్వో వాటర్ ప్లాంట్ ను మంత్రి డాక్టర్ స్వామి ప్రారంభించారు. అనంతరం కొండపి మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాలకు దివ్యాంగులు, వృద్ధులకు సహాయంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వీల్ చైర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు అందిస్తున్న సామాజిక సేవలు అభినందనీయమన్నారు. విద్య, వైద్య రంగాలలో పేద ప్రజలకు తోడ్పాటునందిస్తూ వారికి సాయంగా రోటరీ క్లబ్ నిలుస్తోంది. వైద్య రంగంలో వివిధ వ్యాధులతో పాటు క్యాన్సర్ ని గుర్తించి నివారించేందుకు రోటరీ క్లబ్ పేదలకు సాయం చేస్తోంది. నేడు ప్రారంభించిన వాటర్ ప్లాంట్‌తో పాటు కొండపి మండలంలో మరిన్ని గ్రామాలకు ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు రోటరీ క్లబ్ ముందుకు రావడం శుభపరిణామమన్నారు. ప్రజలకు సేవలందిస్తున్న రోటరీ క్లబ్ కి కొండపి నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు మంత్రి స్వామి తెలిపారు.

# స్వగ్రామంలో పరిశ్రమ.. స్థానికులకు ఉపాధి

**పుట్టి పెరిగిన ఊరిలో పరిశ్రమ ఏర్పాటు అభినందనయం**
**సాయి ఫుడ్ ఇండస్ట్రీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఏలూరి**







**(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, జూన్ 22)**

స్వగ్రామంలోనే పరిశ్రమను స్థాపించి స్థానిక యువత, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో ముందుకొచ్చిన యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఇంకొల్లు మండలం గొల్లపాలెం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన బసాయి ఫుడ్ ఇండస్ట్రీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో పుట్టి పెరిగిన వినోద్ కుమార్ ఉన్నత విద్యను అభ్యసించి స్వగ్రామానికి తిరిగి వచ్చి స్థానికులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో పరిశ్రమను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడం సంతోషకరమని, రైతుల నుంచి నేరుగా పంటను కొనుగోలు చేసి క్రిమిసంహారక అవశేషాలు లేని నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడం మంచి పరిణామమని పేర్కొన్నారు. సహజసిద్ధమైన ఆహార ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని కోరారు.వినోద్ కుమార్ సతీమణి జ్యోతి విదేశాల్లో ఉద్యోగాన్ని వదిలి స్వగ్రామానికి వచ్చి స్థానిక మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో పనిచేయడం ప్రశంసనీయమని అన్నారు. భవిష్యత్తులో ఈ సంస్థ దేశవ్యాప్తంగా విస్తరించి వేలాది మంది యువతకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పరిశ్రమలో ఉద్యోగాలు పొందిన 30 మంది యువతకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ లేఖలు అందజేశారు.

**రూ.36 లక్షలతో విలేజ్ హెల్త్ సెంటర్ ప్రారంభం...**

గొల్లపాలెం గ్రామంలో రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ హెల్త్ సెంటర్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

**దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత....**

గ్రామానికి చెందిన దివ్యాంగుడు వల్లభనేని బాలకృష్ణ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే, అతడిని పరామర్శించి ట్రైసైకిల్ అందజేశారు. దివ్యాంగుల సంక్షేమం ప్రభుత్వ ప్రాధాన్య అంశమని పేర్కొన్నారు.

**పౌలు కుటుంబానికి పరామర్శ...**

ఇంకొల్లులోని స్టాలిన్‌పేటలో ఇటీవల మృతి చెందిన వలేరు పౌలు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

**జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభం....**

మహిళల భద్రత, హక్కుల పరిరక్షణకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఇంకొల్లులో ఏర్పాటు చేసిన జెండర్ రిసోర్స్ సెంటర్ను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించారు. మహిళలకు అవసరమైన సేవలు, సలహాలు ఒకేచోట అందుబాటులోకి రావడం ద్వారా మరింత భరోసా కలుగుతుందని పేర్కొన్నారు.

# జిల్లా జైలును సందర్శించిన జిల్లా న్యాయ సేవ అధికారుల సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ సత్యానంద





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 22)**

క్షణికావేశంలో తప్పులు చేసి జైలు పాలు అవటం వల్ల కుటుంబాలకు దూరమై మానసికంగా శారీరకంగా ఎన్నో ఇబ్బందులు పడవలసి వస్తుందని జిల్లా న్యాయ సేవ అధికారుల సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ సత్యానంద అన్నారు. సోమవారం పట్టణంలోని జిల్లా జైలుని సందర్శించిన న్యాయమూర్తి అక్కడ న్యాయ సహాయం అవసరమైన, న్యాయవాదిని నియమించుకోలేని స్థితిలో ఉన్న ఖైదీలకు తక్షణం న్యాయవాది నియమకానికి ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు పరిశీలించి బారక్‌లో ప్రతి ఖైదీతో ముఖాముఖి మాట్లాడి వారి యొక్క న్యాయపరమైన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జైల్లో దస్త్రాల నిర్వహణ వంటగది నిర్వహణ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి సిహెచ్‌వి రామకృష్ణ, జైల్ సూపరింటిండెంట్ బి రాజ్ కుమార్, జైలర్ ఎం ఏ నాయుడు, డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ పి వీర రాఘవులు, జైలు విసిటింగ్ న్యాయవాదులు, న్యాయ సేవ సహాయకులు పాల్గొన్నారు.

# పాతపాడు అంగనవాడి కేంద్ర భవనం ప్రారంభం





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూన్ 22)**

మండలంలోని పాతపాడు అంగనవాడి కేంద్రం నూతన భవనాన్ని కనిగిరి ఐసిడిఎస్ సిడిపిఓ పి సరోజిని, పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు అట్లా మాలకొండారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో సిడిపిఓ పి సరోజిని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలు, గర్భవతులు, బాలింతల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రాథమిక శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రాలే అంగన్వాడీ కేంద్రాలు అని, గర్భిణీలు, బాలింతలు 7-3 సంవత్సరం పిల్లలకు పాలు, గుడ్లు, బాలామృతం, సంజీవిని కిట్స్ ,బియ్యం, దాల్,ఆయిల్ ఇంటికి ఇస్తున్నామని, 3-6 సంవత్సరాల పిల్లలకు ఆటపాటలతో ప్రీస్కూల్ విద్య స్నాక్స్‌తో పాటు భోజనం, ఆరోగ్య సేవలను అందిస్తున్నారని, మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని, అంగన్వాడీ సేవలను గురించి తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం నవమ్మ, బూత్ కమిటీ కన్వీనర్ ఏ రాఘవ, మధుసూదన్‌రెడ్డి, కనిగిరి ప్రాజెక్టు ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చిన్నారి ప్రాణం పదిలం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చొరవతో ఎల్‌వోసీ ద్వారా 4.5 లక్షల ఆర్థికసహాయం



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 22)

నెలలు నిండకముందే (7 నెలలకే) పాప పుట్టింది. తక్కువ బరువు, ఇతర అనారోగ్య సమస్యలు వచ్చాయి. విజయవాడ రెయిన్ బో హాస్పిటల్‌లో ట్రీట్మెంట్‌కు రోజుకు వేలల్లో ఖర్చు అవుతోంది. పాప తల్లిదండ్రులు దండే విజయ, మాధవ లింగసముద్రం మండలం రాచెరువు రాజుపాలెం గ్రామంలో చాలా పేద కుటుంబం. తల్లి గృహిణి, మాలకొండ దేవస్థానంలో తండ్రి అటెండర్. పసిపాప ప్రాణం నిలబెట్టడానికి ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో దండే మాధవ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి సమస్యను వివరించడంతో ఆయన వెంటనే స్పందించారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 4.5 లక్షల రూపాయలు (ఎల్‌ఓసి) మంజూరు చేయించారు. ఎమ్మెల్యే చొరవ చిన్నారి ప్రాణాలను నిలబెట్టింది. పేదలకు కష్టమొస్తే ముందుండి, ఆపదలో ఆదుకునే మంచి వ్యక్తి, మన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అని చిన్నారి తల్లిదండ్రులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఓబాయిపల్లె గ్రామంలో ధ్వజస్తంభాల ప్రతిష్ట కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల







(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జూన్ 22)

మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీలోని ఓబాయి పల్లెగ్రామంలోనూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో శ్రీ సీతారామాంజనేయస్వామి వారి ఆలయాల్లో నూతనంగా రెండు ధ్వజస్తంభాల ప్రతిష్ట కార్యక్రమాలను గ్రామస్తులు అంగరంగ వైభవంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాలలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా దేవాలయాలలో దేవుళ్లను, ధ్వజస్తంభాలను దర్శించుకున్నారు. ఆయనకు పూజారులు ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రెండు ధ్వజ స్తంభాల ప్రతిష్ట కార్యక్రమాలను తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుండి, చుట్టుపక్కల గ్రామాల నుండి, ఇంటి ఆడపడుచులు, బంధుమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో గ్రామమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది.

# మద్దాలి పవన్ జ్ఞాపకార్థం

## శ్రీ విఘ్నేశ్వర కూచిపూడి నాట్యాలయంలో నోట్ పుస్తకాలు పంపిణీ







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 22)

మద్దాలి పవన్ జ్ఞాపకార్థం ఒంగోలు శ్రీ విఘ్నేశ్వర కూచిపూడి నాట్యాలయంలో కూచిపూడి నేర్చుకుంటున్న చిన్నారులకు నోట్ పుస్తకాలు పండ్లు, పెన్సిళ్లు, రబ్బర్, చాక్మర్‌లను డాక్టర్ మద్దాలి మాధవరావు అందజేశారు. ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన శ్రీ 50 కళారాధన సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మద్దాలి మాధవరావు వారి తనయుడు మద్దాలి పవన్ జ్ఞాపకార్థం కూచిపూడి నేర్చుకుంటున్న చిన్నారులకు అందజేయడం జరిగింది. నాట్య దినోత్సవం సందర్భంగా కూచిపూడి లాంటి సాంప్రదాయ కళలు నేర్చుకుంటున్న వారికి అందజేశారు. ఒంగోలు శ్రీ విఘ్నేశ్వర కూచిపూడి నాట్యాలయంలో నాట్య గురువు కే లక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారులు చక్కటి కూచిపూడి ప్రదర్శన చేస్తున్నారని తక్కువ సమయంలోనే కూచిపూడి నేర్చుకుని అందరి దృష్టిని ఆకర్షించారని డాక్టర్ మద్దాలి మాధవరావు అన్నారు. ఈ కార్యక్రమానికి కె బుచ్చేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ మద్దాలి మాధవరావు మాట్లాడుతూ నాట్యం అనేది ఎంత పవిత్రమైనదని చిన్నప్పటినుండి చిన్నారులకు ఇటువంటి విద్యను నేర్పుతున్న నాట్య గురువు కే లక్ష్మి సేవలు ప్రశంసనీయం అన్నారు. ఇటువంటి నాట్యం నేర్చుకోవడం ద్వారా తమ కాళ్లపై తాము నిలబడి అవకాశం ఉంటుందని అన్నారు సేవ చేయాలనే ఆలోచనలతో తాను ఏదో ఒక కార్యక్రమం నిర్విరామంగా చేస్తూ ఉన్నానని ఈరోజు ఇక్కడ కూచిపూడి నేర్చుకుంటున్న చిన్నారులకు తాను నోటి పుస్తకాలు అందించడం నాకు చాలా సంతోషంగా ఉందని అన్నారు ఈ అవకాశాన్ని నాకు కలిగించిన నాట్య గురువు కె లక్ష్మి కి కృతజ్ఞతలు తెలిపారు. సేవ చేయటం అంటే మనసులో నుండి రావాలని కేవలం అవార్డు తీసుకున్నంత మాత్రాన సేవ చేసినట్టు కాదని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహిస్తూ కూచిపూడి ఇలాంటి సాంప్రదాయ నృత్యాలకు ప్రోత్సాహం ఇవ్వడం చాలా సంతోషం అన్నారు. తన కుమార్ రెడ్డి జ్ఞాపకార్థం ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు చేస్తున్నానని అన్నారు రాబోవు రోజుల్లో ఆధ్యాత్మిక సాంస్కృతిక సేవా కార్యక్రమాలకు తాను సహకరించటం జరుగుతుందన్నారు. చిన్నారులకు సాయం చేసే అవకాశం రావడం సంతోషమన్నారు. నాట్య గురువు కే లక్ష్మి మాట్లాడుతూ మా విఘ్నేశ్వర కూచిపూడి నాట్యాలయంలో చిన్నారులకు నోటు పుస్తకాలు అందజేసిన డాక్టర్ మద్దాలి మాధవరావు సేవలు ప్రశంసనీయమన్నారు. గతంలో వారు ఎన్నో పురస్కారాలు కూడా అందుకున్నారని అన్నారు. కూచిపూడి నేర్చుకోవాలనుకునే వారు 7780698718 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో ఉన్నప్పుడే అందరికీ ఫలితాలు వస్తాయన్నారు. డాక్టర్ మద్దాలి మాధవరావు సేవలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

# మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

### ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 22)

ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా, మునిసిపల్ కార్మికుల సమస్యలపై చేపట్టిన దశల వారీ ఆందోళనల కార్యక్రమంలో భాగంగా సోమవారం కనిగిరి అమరావతి గ్రౌండ్స్ లోని టిడిపి కార్యాలయంలో ప్రకాశం జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని కలిసిన యూనియన్ నాయకులు అనంతరం వినతి పత్రం సమర్పించారు. కార్మికులు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వినతి పత్రం స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ మునిసిపల్ రంగంలో అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ యూనియన్ నాయకులు నాసర్, ఖాదర్ వలి, కిరణ్, మస్తాన్ వలి, యేసుబాబు, సాల్మన్, సుబ్రహ్మణ్యం, ఇమామ్ హుస్సేన్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# అంకురార్పణతో ఘనంగా ప్రారంభం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 22)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ వైఖానస ఆగమపండితులు పరాంకు శం సీతా రామాచార్యులు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు నాందీ సూచకంగా అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

విష్వక్సేన పూజ, మేదినీ పూజ, పుణ్యాహవాచనం, మృత్సంగ్రహణం, వాస్తు హోమం, ధ్వజదండ, ధ్వజపట గరుడ ప్రతిష్ఠ నిర్వహించారు. శ్రీవారికి గరుత్మంతుణ్ణికి నడుమ మహా మండపం సీలింగు పై భగవంతుని సర్వవ్యాపకత్వం చాటుతూ అష్టదిక్పాలురర నడుమ వటపత్ర శాయి పవళించి ఉన్న కళా ఖండాన్ని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్, రాజీవ్, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మి కుమారి, ఆలూరు జై శంకర్, ఆలూరు కుమార ఆత్రేయ, తదితరులు ఆవిష్కరించారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ధ్వజారోహణం, సాయంత్రం పొన్నూరు వెంకట శ్రీనివాసులుచే ఆధ్యాత్మిక ఉపన్యాసం జరుగుతాయి.







On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# బ్రిలియంట్ ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్ 2026 ప్రారంభం

## ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 22)

ఇంటర్మీడియట్ అయిన తర్వాత దేశ విదేశాల్లో ఎలాంటి కోర్సులు ఉన్నాయి, ఏ కోర్సు కు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయి తదితర విషయాలను విద్యార్థులు తెలుసుకునేందుకు ఏర్పాటైన బ్రిలియంట్ ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్ 2026 ప్రారంభిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు పేర్కొన్నారు. సోమవారం ఒంగోలు నగరంలోని ఏ1 కన్వెన్షన్ సెంటర్ లో బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ వారి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన బ్రిలియంట్




విద్యార్థులకు సూచించారు. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ బ్రిలియంట్ సంస్థ వారు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమైనదని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మన జిల్లా విద్యార్థులు ప్రపంచం నలుమూలల తమ జిల్లా ఖ్యాతిని చాటి చెప్పాలని అది కూడా బ్రిలియంట్ సంస్థ ద్వారా అయితే మరీ బాగుంటుందని ఉద్బోధించారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత డిజిపీ కెఆర్ఎం కిషోర్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్మీడియట్ తర్వాత తాము వేయబోయే











ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్ 2026 కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్న దామచర్లజనార్దన్ ఈ సందర్భంగా వివిధ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్దనరావు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో విద్యార్థులకు ఉపయోగపడేలా ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ వారిని అభినందిస్తూ, ఇలాంటి విద్యా కోర్సుల అవగాహన కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఇంటర్మీడియట్ అయిన తర్వాత దేశ విదేశాల్లో ఎలాంటి కోర్సులు ఉన్నాయి, ఏ కోర్సుకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయి, తదితర విషయాలను విద్యార్థులు తెలుసుకునేందుకు ఇలాంటి ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు అకడమిక్ విద్యతో పాటు కమ్యునికేషన్ స్కిల్ పెంపొందించుకొని జీవితంలో బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్‌లో అనేక విశ్వవిద్యాలయాల ప్రతినిధులు వచ్చి ఆయా విశ్వవిద్యాలయాల్లో ఉన్న కోర్సుల వివరాలు, ఉద్యోగ అవకాశాలు తదితర వివరాలతో స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యార్థులు కూడా ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రతి అడుగు వారి జీవన గమనాన్ని దిశానిర్దేశం చేస్తుందని, కనుక అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఇలాంటి మెగా ఫెయిర్స్ బాగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అనంతరం ల్యాప్ టాప్ లక్కీ డ్రా తీసి విజేతలకి అందచేశారు. ఈ సశీవత్సరం ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామ్స్‌లో 950కి పైగా మార్కులు సాధించిన ఉమ్మడి జిల్లాలలోని వందలాది మంది స్టూడెంట్స్ కి గోల్డ్ మెడల్స్, ఫ్రైడ్ ప్రకాశం మెరిట్ సర్టిఫికెట్ ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్ కె న్యామత్, మేనేజింగ్ డైరెక్టర్ తౌహురా, డైరెక్టర్ అఖిల్, బ్రిలియంట్ సంస్థ కోర్స్ కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు, ఈవెంట్ మేనేజర్ నాగార్జున, క్విస్, హర్షిణి, వివిఐటి, కెఎల్, విజ్ఞాన్, విఐటి, ఇక్ఫాయ్, జిజియు యూనివర్సిటీలు, మరో 25 కాలేజీలు, యూనివర్సిటీలకు చెందిన ప్రతినిధులు, సుమారు 2000 మంది విద్యార్థులు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వైద్య ఖర్చులు కోసం రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించిన పోతినేని శ్రీనివాసరావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 22)

ఇటీవల యాక్సిడెంట్ అయిన పెద్దకొత్తపల్లి అంజయ్య నగర్ గ్రామానికి చెందిన కాకి పున్నారావు కి తన ఆరోగ్య దృష్ట్యా మద్దిపాడు మండల టిడిపి సీనియర్ యువ నాయకులు పోతినేని శ్రీనివాసరావు తన దాతృత్వాన్ని చాటుకుంటూ వైద్యం ఖర్చుల కోసం రూ. 50 వేలు ఆర్థిక సహాయాన్ని ఇంటి వద్ద పున్నారావుకి అందించారు. ఈ సందర్భంగా పిఎస్ఆర్ మాట్లాడుతూ ఆపద అని వస్తే నా వంతు సహాయం చేయడం జరుగుతుందని, నాకు ఉన్నంతలోనే ఆ భగవంతుడు ఆశీస్సులతో సహాయం అందిస్తానని అన్నారు. ఆయనతోపాటు పెద్దకొత్తపల్లి సర్పంచ్ కాకి శైలజ, మద్దులూరి సుధాకర్, ఉదరగుడి హనుమంతరావు, దుగ్గిరాల శీను, తదితరులు ఉన్నారు.

# కామేపల్లి రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ తీవ్ర విచారం

## మృతుల కుటుంబాలకు పరామర్శ, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు







(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 21)

నరసరావుపేట - వినుకొండ రహదారి కామేపల్లి వద్ద జరిగిన విషాదకర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడం పట్ల ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో పలువురు గాయపడడం కూడా అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఆటోను వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన సుబ్బాయమ్మ, రమణమ్మ, ఏడుకొండలు మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే జీవీ ఆంజనేయులు స్పందించి, అధికారులతో మాట్లాడి సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న ఆయన మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శ చేశారు ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నరసరావుపేటలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించిన జీవీ ఆంజనేయులు, వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు, చికిత్సలో ఎలాంటి లోటు లేకుండా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ ప్రమాదం ఎంతో బాధాకరం. అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం కలచివేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాలకు, క్షతగాత్రులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.



# యువకుడిని హత్య చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

## అక్రమ సంబంధం నేపథ్యంలో హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానం








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 22)

సంతనూతలపాడు మండలం మంగమూరు ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి దారుణం చోటుచేసుకుంది. అశోక్ అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశారు. స్థానికులు విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అక్రమ సంబంధం నేపథ్యంలో హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు గవర్నమెంట్ హాస్పిటల్ తీసుకొచ్చి నేపథ్యంలో అక్కడ అశోక్ కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని రోడ్డు మీద రాస్తారోకో నిర్వహించి ధర్నా కార్యక్రమం చేపట్టారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రికెట్ ఆడి వచ్చి ఇంట్లో విశ్రమిస్తున్న తమ కొడుకుని బయటకు పిలిచి దారుణంగా హత్య చేశారు అని అన్నారు ..ఆదివారం సాయంత్రం క్రికెట్ ఆడి ఇంటికొచ్చి నిద్రపోతున్న అశోక్‌ను, మధు అనే తెలిసిన వ్యక్తి బయటకు తీసుకెళ్లాడ అని , అయితే, అర్ధరాత్రి 12 గంటల సమయంలో మధు ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు ఓ భయంకరమైన వార్త చెప్పాడ అని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది .చందు, సతీష్, సంతోష్ అనే ముగ్గురు వ్యక్తులు అశోక్ ను కత్తులతో పొడిచి చంపారని, అడ్డుకోబోయిన తనపై కూడా దాడి చేశారని మధు తెలిపాడ అని ఆమె అన్నారు.వారు స్థలానికి చేరుకునే సరికి, అశోక్ కాలువ కట్ట వద్ద విగతజీవిగా పడి ఉన్నాడ అని . వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించినట్లు తెలిపారని ఆమె తెలియజేశారు.తన కళ్లెదుటే పెరిగిన కొడుకును అకారణంగా చంపేశారంటూ అశోక్ తల్లి సుశీలమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తన కొడుకును పొట్టనపెట్టుకున్న వారిని కఠినంగా శిక్షించి, తమకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకుంటున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.